16CTR1:16CTR1.qxd 10/15/2026 11:38 PM Page 1



తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ల ప్రస్థానం · వార్షికోత్సవం · 1996 - 2026

## కాణిపాకం ఆలయానికి రూ.10 లక్షలు విరాళం



కాణిపాకం, అక్టోబర్ 15 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారి ఆలయ అభివృద్ధికి ఓ భక్తుడు గురువారం 10 లక్షలు రూపాయలను విరాళంగా అంద జేశారు. ఈమేరకు తమిళనాడు రాష్ట్రం హోసూరుకు చెందిన ధనూష్‌నాయుడు అనే భక్తుడు ఆలయ అభివృద్ధికి 10 లక్షలు రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడులకు ఆన్‌లైన్ ద్వారా అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## శ్రీచెంగాళమ్మకు శ్రీ బాలా త్రిపుర సుందరి అలంకారం



సూళ్లూరుపేట, అక్టోబర్ 15 ప్రభాతవార్త:
శ్రీ చెంగాళమాత పరమేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రుల్లో భాగంగా శ్రీచెంగా ళమ్మకు గురువారం శ్రీబాలా త్రిపురసుందరి అలం కారం చేసి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. ప్రత్యేక అలంకారానికి శ్రీసిటీ ఎండి రవిసన్నారెడ్డి, మమత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. దేవస్థాన ప్రాంగణంలోని యాగ మండపంలో నిర్వహించిన చండీయాగానికి సూళ్లూరుపేటకు చెందిన చిట్టేటి పెరుమాళ్ళు, గోవిందమ్మ దంపతులు ఉభయకర్తలుగా ఉన్నారు. సాయంత్రం కవిత బృందం సూళ్లూరుపేట వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన, శ్రీలక్ష్మి బృందం శ్రీకాళహస్తి వారిచే భరతనాట్యం, శ్రీ దుర్గా నాట్యమండలి నెల్లూరు వారిచే హరిశ్చంద్ర కాటి సీను ఘట్టం భక్తులను అలరించాయి. దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

## బకాసురవధ అలంకారంలో
# కలియుగ వైకుంఠవాసుడు



తిరుమల,అక్టోబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:
కలియుగవైకుంఠవాసుడు వేంకటేశ్వరుడు గురువారం ఉదయం బకాసురవధ అలంకారంలో మలయప్పస్వామి కల్పవృక్షవాహనాన్ని అధిరోహించారు. ఉదయం నిత్యకైంకార్యలు పూర్తిచేసుకున్న తరువాత ఆలయంనుండి మలయప్పస్వామిని వాహనమండపం వద్దకు వేంచేపుచేశారు. ఇక్కడ వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారిని కల్పవృక్షవాహనంపై అధిరోహింపజేశారు. కర్పూరహారతులిచ్చి ఉదయం 8గంటలకు వాహనం ఆలయమాఢవీధుల్లో ప్రదక్షణగా బయలుదేరింది. స్వామివారి వాహనంముందు భక్తులు గోవిందా... గోవిందా అంటూ నామస్మరణలతో తన్మయత్వం పొందారు. క్షీరసాగరమధనంలో విలువైన వస్తువులెన్నో ఉద్భవించాయి. వాటిలో కల్పవృక్షం ఒకటి. ఈ చెట్టునీడన చేరినవారికి ఆకలిదప్పులుండవు. పూర్వజన్మస్మరణ కూడా కలుగుతుంది. ఇతర వృక్షాలు తాము కాచిన ఫలాలు మాత్రమే ప్రసాదిస్తాయి. కల్పవృక్షం వాంఛిత ఫలాలన్నిటినీ ప్రసాదిస్తుంది. అటువంటి కల్పవృక్షవాహనాన్ని అదిరోహించి తిరుమాఢవీధుల్లో కలియుగప్రత్యక్షదైవం విహరించి భక్తులను కటాక్షించాడు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు దంపతులు, ఈఓముద్దాడ రవిచంద్ర, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, టిటిడి అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, జేఈఓ (విద్యా, ఆరోగ్యం) ప్రభల గోపీనాథ్, సివిఎస్ఓ మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈఓ భాస్కర్, పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి అధికారులు పాల్గొన్నారు.

## రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామిగా మలయప్ప

తిరుమల,అక్టోబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:
శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి మలయప్ప స్వామి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి అలంకారంలో సర్వభూపాల వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 నుండి 9 గంటల వరకు నాలుగు మాడ వీధుల్లో వైభవంగా విహరించి భక్తులను అనుగ్రహించారు.

### గజరాజుల ముందు నడక.. మంగళవాయిద్యాల నడుమ వైభవం

వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తబృందాల చెక్కభజనలు, జీయ్యంగార్ల గోష్టి, మంగళ వాయిద్యాల నడుమ వాహనసేవ అంగరంగ వైభవంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ గోవింద నామస్మరణతో స్వామివారిని దర్శించుకున్నారు.

### సర్వభూపాల వాహనసేవలో విశేష ఆధ్యాత్మిక సందేశం

సర్వభూపాల అంటే సమస్త రాజులు అని అర్థం. అష్టదిక్పాలకులైన ఇంద్రుడు, అగ్ని, యముడు, నిర్‌ృతి, వరుణుడు, వాయువు, కుబేరుడు, పరమేశ్వరుడు లోకాలను పరిరక్షి ంచే శక్తులకు ప్రతీకలుగా నిలుస్తారు. వీరందరూ స్వామివారిని తమ భుజస్కంధాలపై మోస్తూ సేవించడం ఈ వాహనసేవ ప్రత్యేకత. ప్రజలను ధర్మబద్ధంగా పరిపాలిస్తూ, భగవంతుని ఆశీస్సులతో లోకక్షేమానికి కృషి చేయాలనే సందేశాన్ని సర్వభూపాల వాహనసేవ చాటిచెబుతుంది. ఈ వాహనసేవలో తిరుమల పెద్దజీయర్ స్వామి,చిన్నజీయర్ స్వామి, టిటిడి చైర్మన్ బి.ఆర్. నాయుడు దంపతులు, ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ సి.హెచ్. వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు జానకిదేవి, నన్నపనేని సదాశివరావు, నరేష్ కుమార్, పూర్ణ సాంబశివరావు, జేఈఓలు డాక్టర్ ఎ. శరత్, ప్రభల గోపీనాథ్, సివిఎస్ఓ మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# వీడిన సస్పెన్స్!

## చిత్తూరు, తిరుపతి టిడిపికే ఖరారు!!




ప్రభాతవార్త-తిరుపతి:
సిఎం చంద్రబాబునాయుడు సొంత జిల్లాల్లో తిరుపతి,చిత్తూరు నగరపాలకసంస్థల మేయర్ అభ్యర్థులు ఎట్టకేలకు టిడిపికే ఖరారైంది. ఇప్పటి వరకు తీవ్రస్థాయిలోఈ చోట్ల మేయర్ అభ్యర్థుల పోటీపై కూటమిలోని టిడిపి, జనసేన,బిజెపి పార్టీల మధ్య కొనసాగుతూ వచ్చిన ఉత్కంఠతకు ఎట్టకేలకు గురువారం రాత్రి తెరపడింది. సుదీర్ఘ చర్చల అనంతరం టిడిపికి బలమైన ఓటు బ్యాంకు, పార్టీ నాయకత్వం, ప్రజల విశ్వాసం ఉన్న తిరుపతి,చిత్తూరులలో పోటీకి టిడిపికే అవకాశం లభించింది.దీంతో ఈ రెండు నగరపాలక సంస్థల మేయర్ స్థానాల్లో పోటీపై ఉన్నసందిగ్ధతలు తొలగిపోయాయి. మేయర్ పదవి తెలుగుదేశం పార్టీకే కేటాయిస్తూ కూటమి పార్టీల అధినేతలు, సిఎం చంద్రబాబు నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా మేయర్, మున్సిపల్ చైర్మన్ స్థానాల పంపకాలపై కూటమి పార్టీల మధ్య ఒప్పందం కుదిరింది. టిడిపికి చెందిన రెడ్డి సామాజిక వర్గ నేతకు గానీ బిసీ నేతకు అవకాశం లభించవచ్చున్న ప్రచారం కూడా ఊపందుకుంది. తిరుపతి ఎమ్మెల్యే జనసేనకు చెందినవారు కావడంతో మేయర్ పదవి విషయంలో ఆ పార్టీ తన వాదనను వినిపిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే తిరుపతిలో టిడిపికి ఉన్న రాజకీయ బలం, పార్టీ నేతల ఆశలు, కూటమి సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకున్నారు. మేయర్ అభ్యర్థి ఎంపికలో జాప్యం ఆశావహులను కలవరపెడుతోంది. శుక్ర, శని, ఆదివారాల్లో నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉండటంతో, అభ్యర్థి పేరును చివరి నిమిషంలో ప్రకటిస్తే అవసరమైన పత్రాలను సమకూర్చుకోవడం కష్టమవుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నామినేషన్‌కు అవసరమైన నో డ్యూ సర్టిఫికెట్, కేసులకు సంబంధించిన వివరాలు, ఆస్తుల వివరాలు తదితర పత్రాలను సిద్ధం చేసుకోవడానికి సమయం సరిపోదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొందరు ఆశావహులు ముందుగానే అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకున్నప్పటికీ, మరికొందరు పార్టీ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. మేయర్ పదవి ఎవరికి దక్కుతుందన్నదానిపై ఇప్పుడు సిఎం చంద్రబాబు నిర్ణయంపై ఆధారపడింది. నామినేషన్ల గడువు సమీపిస్తుండటంతో తిరుపతి మేయర్ అభ్యర్థి ప్రకటనపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది.

### గరుడ వాహనంపై
# శ్రీ మూలస్థాన ఎల్లమ్మ



చంద్రగిరి, అక్టోబర్ 15 ప్రభాతవార్త:
శ్రీ నారాయణి అలంకరణలో శ్రీ మూలస్థాన ఎల్లమ్మ గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చి అనుగ్రహించారు. సత్యప్రమాణాలకు నెలవై కొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి దేవీ నవరాత్రి మహోత్సవాలను దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి పాలక మండలి, ఈఓ మమత పర్యవేక్షణలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు సూరిస్వామి గురువారం అమ్మవారికి వేకువజామున అభిషేకం జరిపించి విశేష అలంకరణలతో తీర్చిదిద్ది భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం 7 గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని వివిధరకాల సుగంధ భరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణలతో ముస్తాబు గావించి గరుడ వాహనంపై అధిష్టింపజేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బ్యాండుబాజాల నడుమ భక్తుల భజనలతో అమ్మవారి వాహనసేవ కన్నుల పండువగా సాగింది.

# గీత దాటితే చర్యలు

**స్థానిక ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సర్వసన్నద్ధం : కలెక్టర్ వెంకటేశ్వర్**
**సీసీ కెమెరాలు, డ్రోన్లతో ఎన్నికల భద్రతపై నిఘా : ఎస్‌పి సుబ్బరాయుడు**



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీలు

తిరుపతి కలెక్టరేట్, అక్టోబర్ 15 ప్రభాతవార్త:
జిల్లాలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధమైందని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు.రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని విసి హాల్ నందు ఎస్పి ఎల్. సుబ్బరాయుడు, జేసి ఆర్.గోవిందరావు, డిఆర్ఓ జి.నరసింహులులతో కలసి జిల్లా కలెక్టర్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది, ఎన్నికల సామగ్రి, భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, ఇతర మౌలిక సదుపాయాలపై సమగ్ర ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం తొలుత మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలకు నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు వెంకటగిరి, పుత్తూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీల ఎన్నికలకు ఈ నెల 16, 17, 18 తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. మేయర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులకు, వార్డు సభ్యుల పదవులకు వేర్వేరుగా నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేశామన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు ఈ నెల 19వ తేదీన నోటిఫికేషన్ విడుదల కానుండగా, గ్రామ పంచాయతీ ఎన్నికలకు మూడు విడతల్లో నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. తదనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లోనూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వస్తుందని వివరించారు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జెడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీలు, వార్డులు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు రిజర్వేషన్ల ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా పూర్తి చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల జనాభా గణాంకాలు, రిజర్వేషన్ నిబంధనలు, రొటేషన్ విధానాలను పరిగణనలోకి తీసుకుని రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు పేర్కొన్నారు.

మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 19వ తేదీన నామినేషన్ల పరిశీలన, 21వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ నిర్వ హించనున్నట్లు తెలిపారు. ఉపసంహరణ అనంతరం అదే రోజు సాయంత్రం పోటీలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీన పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎస్పి ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ నామినేషన్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

అవసరమైన ప్రాం తాల్లో డ్రోన్లను వినియోగించి భద్రతను మరింత బలోపేతం చేయనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిని గుర్తించి, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను సమీక్షి స్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# తిరుపతి డీఎల్పీవోగా గంగాభవానికి అదనపు బాధ్యతలు

**ప్రకాశం జిల్లా డీపీఓ కార్యాలయానికి బి. సురేష్ నాయుడు**

తిరుపతి, అక్టోబర్ 15 ప్రభాతవార్త:
స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో తిరుపతి డివిజన్ పంచాయతీరాజ్ శాఖలో అధికారుల బాధ్యతల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. తిరుపతి జిల్లా కలెక్టం ఉత్తర్వుల మేరకు, తిరుపతి డివిజనల్ పంచాయతీ అధికారి బి. సురేష్ నాయుడును ప్రకాశం జిల్లా డీపీఓ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై పంపించారు. ఈ నేపథ్యంలో సురేష్ నాయుడును తిరుపతి డివిజనల్ పంచాయతీ అధికారి బాధ్యతల నుంచి రిలీవ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో తిరుపతి డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిగా పనిచేస్తున్న బి. గంగాభవానికి డివిజనల్ పంచాయతీ అధికారి బాధ్యతలను అదనంగా అప్పగించారు. ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ మార్పులు చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సురేష్ నాయుడు వెంటనే ప్రకాశం జిల్లా కలెక్టర్ ఎదుట హాజరుకావాలని, గంగాభవాని డివిజనల్ పంచాయతీ అధికారి బాధ్యతలు స్వీకరించి, ఆ వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాలని ఆదేశించారు. అలాగే సురేష్ నాయుడు ప్రకాశం జిల్లాలో విధుల్లో చేరిన తేదీని తెలియజేయాలని అక్కడి జిల్లా కలెక్టర్‌ను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పరిపాలనా వ్యవహారాలు సజావుగా సాగేందుకు అధికారుల బాధ్యతల్లో ఈ మార్పులు చేసినట్లు కలెక్టర్ కార్యాలయం జారీ చేసిన ఉత్తర్వులు స్పష్టం చేస్తున్నాయి.

# మున్సిపల్ ఛైర్మన్ కుర్చీపై...అన్ని పార్టీల కన్ను

## జనసేన, బిజెపి పట్టు

శ్రీకాళహస్తి, అక్టోబర్ 15 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి పురపాలక సంఘ ఎన్నికల ఛైర్మన్ సీటు సర్దుబాటుపై కూటమిలో చర్చలు కొలిక్కిరాలేదు. ఈ సీటు కోసం జనసేన, బిజెపి పట్టుబట్టినట్లు సమాచారం. కూటమిలో జనసేన, బిజెపిలు కొన్ని సీట్లు కేటాయించడానికి నాయకులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో కూటమిలోని జనసేన, బిజెపిలు శ్రీకాళహస్తి మున్సిపల్ ఛైర్మన్ పదవి కోసం పట్టుబట్టారు. అయితే మున్సిపల్ డిలిమిటేషన్ వివాదం కోర్టుకెక్కడంతో ఎన్నికలు వాయిదాపడుతున్నాయి. 2020లో జరిగిన ఎన్నికల సందర్భంగా డిలిమిటేషన్ వివాదంపై తెలుగుదేశం నాయకుడును కోర్టును ఆశ్రయించారు. దాంతో ఆ ఐదేళ్ళు మున్సిపాలిటికి పాలక మండలి లేకుండానే పరిపాలన సాగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తెలుగుదేశం పార్టీ కోర్టులో వేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకుంది. అయినా సాంకేతిక కారణాలతో కోర్టు వివాదం సాగి చివరకు పరిష్కారమైంది. హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టులో వ్యాజ్యాలు వేసినా అక్కడ కూడా గురువారం వెలువడిన తీర్పులో డిలిమిటేషన్ వివాదానికి సంబంధించి చుక్కెదురైంది. ఇక ఎన్నికలు కంపల్సరైంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 23 మున్సిపాలిటీల్లో శ్రీకాళహస్తి మున్సిపాలిటీ కూడా వుంది. ఈ మున్సిపాలిటికి సంబంధించి కొత్త నిబంధనల ప్రకారం డిలిమిటేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. అయినా 8 అభ్యంతరాలు వచ్చినట్లు కమిషనర్ ధృవీకరించారు. వాటి పరిష్కారానికి ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు.

### ఎట్టకేలకు ఎన్నికలు కూటమిలో చర్చలు:

శ్రీకాళహస్తి మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి స్పష్టత వచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికలు రెండవ దశలో మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. న్యాయపరమైన చిక్కులు తొలగిన దృష్ట్యా శ్రీకాళహస్తి మున్సిపాలిటికీ రెండవ దశలో ఎన్నికలు జరగవచ్చునని సమాచారం. డిసెంబర్‌లో జరిగే ఎన్నికలకు సంబంధించి కూటమిలో సర్దుబాటు చర్చలు సాగుతూనే వున్నాయి. శ్రీకాళహస్తి మున్సిపాలటీ ఛైర్మన్ గిరి సర్దుబాటులో తమకు అవకాశం కల్పించాలని ఓ వైపు జనసేన, మరో వైపు బిజెపి పట్టుబడుతున్నాయి. ఇప్పటికే శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్ పగ్గాలను జనసేనకు అప్పగించారు. ప్రస్తుతం మున్సిపాలిటిని కూడా కోరుతున్నారు. దాంతో తెలుగుదేశం పార్టీకి ఆవిర్భావం నుండి కంచుకోటగా వున్న శ్రీకాళహస్తికి కూటమి బీటలు ఏర్పడుతున్నాయని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ మున్సిపాలిటీ ఛైర్మన్ గిరి జనసేనకే అని ప్రచారం బలంగా సాగుతుంది. ఒక వేళ జనసేనకే అవకాశం కల్పిస్తే అభ్యర్థిగా ఇటీవల పార్టీ తీర్థం పుచ్చుకున్న మిద్దెల హరికే అని ప్రచారం సాగుతుంది. ఆయన కూడా గురువారం స్థానిక శాసనసభ్యున్ని కలిశారు. దాంతో తెలుగుదేశం పార్టీ తరుపున ఛైర్మన్ కుర్చీ ఆశించిన వారికి నిరాశే మిగిలింది. ఒక వేళ సర్దుబాటులో ఈ మున్సిపాలిటీ తెలుగుదేశంకే ఖరారు అయితే ఆశించే వారిలో బిసివర్గానికి చెందిన నాగమల్లి దుర్గాప్రసాద్, గుమ్మడి దశరధాచారి, పేట బాలాజీ ఎన్నికలకు పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమైనట్లు కొత్తగా మిట్టకండ్రిగలోని మిల్లర్ బాబు పేరు కూడా తెరపైకి వచ్చింది. అయితే శాసనసభ్యుడు ఆది నుండి పార్టీకి పని చేసిన వారికే అవకాశం అన్న నిర్ణయంతో గురువారం కేటాయించిన మండలాధ్యక్షుల అభ్యర్థుల ఎంపికతో స్పష్టమైంది. కాబట్టి తెలుగుదేశం పార్టీకి అవకాశం దక్కితే ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి ఆది నుండి పార్టీలో వున్న వారికే అవకాశం కల్పిస్తారనడంలో రెండవ అభిప్రాయం లేదు. ఎన్నికల ప్రకటన నుండి ఎంఎల్‌ఏ శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో కూటమి జెండా ఎగరేస్తామంటూ ప్రకటిస్తున్నారు.

# తైక్వాండోలో పతకాల వేట..

**జాతీయ బరిలో ఐదుగురు**
**రాష్ట్రస్థాయి పోటీల్లో 21 పతకాలతో సత్తా**
**అండర్-14 నుంచి ముగ్గురు, అండర్-17 నుంచి ఇద్దరికి అవకాశం**



తిరుపతి విద్య, అక్టోబర్ 15 ప్రభాతవార్త
తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారులు తమ సత్తా చాటారు. ప్రత్యర్థులతో హోరాహోరీగా తలపడుతూ పతకాల వేటలో మెరుగైన ప్రదర్శన కనబరిచారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ఐదు స్వర్ణాలు, ఏడు రజతాలు, తొమ్మిది కాంస్య పతకాలతో మొత్తం 21 పతకాలు సాధించారు. ఈ విజయాలతో ఐదుగురు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించడం విశేషం.జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వారిలో కె.కీర్తన (18 కిలోలు), వి.ప్రభాస్ (41 కిలోలు), వి.కమలేష్ (41 కిలోల పైబడి), ఎం.ప్రభాస్ (35 కిలోల లోపు), తులసీరామ్ (68 కిలోలు) ఉన్నారు. వీరిలో ఎం.ఆర్.పల్లికి చెందిన కె.కీర్తన, బి.ప్రభాస్ చిత్తూరు జిల్లా తరఫున తమ ప్రతిభను చాటారు. మిగిలిన ముగ్గురు కూడా చిత్తూరు జిల్లాలోని ఇతర ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు. అండర్-14 విభాగం నుంచి ముగ్గురు, అండర్-17 విభాగం నుంచి ఇద్దరు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు.రాష్ట్రస్థాయి పోటీల్లో వివిధ బరువు విభాగాల్లో పోటీపడి పతకాలు సాధించడం క్రీడాకారుల కృషి, సాధనకు నిదర్శనంగా నిలిచింది. ముఖ్యంగా ఐదుగురికి జాతీయస్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శిం చే అవకాశం లభించడంతో తదుపరి పోటీలపై ఆసక్తి పెరిగింది. రాష్ట్రస్థాయిలో సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని జాతీయ పోటీల్లోనూ మెరుగైన ప్రదర్శన చేయాలని క్రీడాకారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అక్కడకూడా పతకాలు సాధించి తమప్రాంతానికి గుర్తింపు తీసుకురావాలని

# సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారు

చిత్తూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త:

గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల రిజర్వేషన్లను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ అసాధారణ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా వున్న మండలాల పరిధిలో పారదర్శకంగా, జనాభా ప్రాతిపదికన సర్పంచ్, వార్డు స్థానాలకు రిజర్వేషన్లు కేటాయించినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలో 27 మండలాలు, 622 గ్రామ పంచాయతీలు, 5,906 వార్డులు వున్నాయి. ఇందులో ఎస్సీలకు 155 గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవులు రిజర్వ్ చేయగా ఇందులో ఎస్సీ మహిళలకు 72 సర్పంచ్ పదవులు కేటాయించారు. అలాగే జిల్లాలో ఎస్టీలకు మొత్తం 19 సర్పంచ్ స్థానాలు కేటాయిస్తే ఇందులో 16 సర్పంచ్ స్థానాలను ఎస్టీ మహిళలకు రిజర్వ్ చేశారు. అలాగే జిల్లాలో 126 సర్పంచ్ స్థానాలను బీసీలకు కేటాయిస్తే ఇందులో 62 సర్పంచ్ స్థానాలు బీసీ మహిళలకు రిజర్వ్ చేశారు. అలాగే 316 సర్పంచ్ స్థానాలు జనరల్ కేటగిరికి కేటాయించగా ఇందులో 163 సర్పంచ్ స్థానాలు జనరల్ కేటగిరి మహిళలకు కేటాయించారు. అలాగే మొత్తం 5,906 వార్డుల్లో ఎస్సీలకు 1,386 వార్డులు కేటాయించగా ఇందులో ఎస్సీ మహిళలకు 601 వార్డుల స్థానాలు రిజర్వ్ చేశారు. అలాగే ఎస్టీలకు 183 వార్డు స్థానాలు కేటాయిస్తే ఇందులో 58 వార్డు స్థానాలు ఎస్టీ మహిళలకు రిజర్వ్ చేశారు. అలాగే బీసీలకు 1,326 వార్డు స్థానాలు కేటాయిస్తే ఇందులో 617 వార్డు స్థానాలు బీసీ మహిళలకు కేటాయించారు. జనరల్ కేటగిరికి 3,011 వార్డులు కేటాయించగా ఇందులో 1,669 వార్డులను జనరల్ కేటగిరిలో మహిళలకు రిజర్వ్ చేశారు.

**పారదర్శకంగా రిజర్వేషన్లు : కలెక్టర్ సుమిత్‌కుమార్**

ప్రభుత్వ నిబంధనల మేరకు కట్టుబడి చట్టబద్ధమైన జనాభా గణాంకాల ఆధారంగానే జిల్లాలో సర్పంచ్, వార్డు స్థానాలకు రిజర్వేషన్లు కేటాయించడం జరిగిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సర్పంచ్ వార్డు స్థానం ఏ కేటగిరికి కేటాయించబడిందనే తెలిపే సమగ్ర నివేదిక జిల్లా కలెక్టర్ కార్యాలయం, సంబంధిత డివిజనల్ పంచాయతీ ఆఫీసర్లు, మండల పరిషత్ కార్యాలయాల్లోని సమాచార బోర్డుల్లో ప్రదర్శించడం జరిగిందన్నారు. పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, వార్డుల వారీ రిజర్వేషన్ జాబితాలను ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సంబంధిత ఎంపిడిఓ కార్యాలయాల్లో, చిత్తూరు జిల్లా అధికారిక వెబ్‌సైట్ ద్వారా పరిశీలించుకోవచ్చునని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

## సేంద్రీయ ఎరువుల తయారీ ప్రారంభం

బైరెడ్డిపల్లి, అక్టోబర్ 15 ప్రభాతవార్త




మండలంలోని అన్ని పంచాయతీల్లోని చెత్త సంపద తయారీ కేంద్రాల ద్వారా సేంద్రీయ ఎరువుల తయారీ చేపట్టనున్నట్లు ఎంపిడిఓ ఆన ఒద్‌బాబు తెలిపారు. గురువారం స్థానిక చెత్తస ంపద తయారీ కేంద్రంలో సేం ద్రీయ ఎరువుల తయారీని ఆయన ప్రారంభించారు. సేంద్రీయ ఎరువుల వాడకంతో పంటలు సైతం నాణ్యతతో సాగవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ పెరటి తోటల పెంపకం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ నరసింహులు, ఎంఎస్‌జిఓ సుజాత, ఎఇలు రాధిక, మహేశ్వరి పాల్గొన్నారు.

## స్వేచ్ఛగా ఎన్నికల పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు

**– పోలింగ్ స్టేషన్ల పోలింగ్ స్టేషన్ల తనిఖీలో అడ్మిన్ ఎఎస్పీ మహబూబ్ భాషా**

చిత్తూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త:

మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా నిర్వహించేలా పక్కా ఏర్పాట్లు చేపట్టాలని అడ్మిన్ ఎఎస్పీ మహబూబ్ భాషా వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ చిన్న పెద్దయ్యను ఆదేశించారు. అడ్మిన్ ఎఎస్పీ మహబూబ్ భాషా గురువారం వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ పెద్ద చిన్నయ్యతో కలిసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలు, నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికల నియమ నిబంధనలు పాటిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అడ్మిన్ ఎఎస్పీ మహబూబ్ భాషా నామినేషన్ కేంద్రాల వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లు, పోలీసు విధుల నిర్వహణ, అభ్యర్థులు, ప్రజల రాకపోకలకు సంబంధించిన పరిస్థితులను పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా నామినేషన్ల దాఖలు సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్ఐ నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

## గజలక్ష్మి అలంకారంలో అమ్మవారి దర్శనం

రైల్వే కోడూరు అర్బన్, అక్టోబర్ 15 ప్రభాతవార్త



రైల్వేకోడూరు మండలం స్థానిక పొట్టి శ్రీరాములు వీధిలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా ఐదవ రోజు అమ్మవారు భక్తులకు గజలక్ష్మి అలంకారంతో దర్శనమిస్తారు. అమ్మవారి దర్శనంతో భక్తులు భక్తిపారవశ్యంలో ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారిందని, రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ప్రజలందరూ అమ్మవారిని ఎంతో భక్తిశ్రద్ధలతో దర్శించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పెండ్యాల విజయ్ కుమార్ తెలిపారు. అంతేకాకుండా ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, యువజన సంఘం సభ్యులు, మహిళా మండలి సభ్యులు ప్రతి ఒక్కరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగిందని మీడియా వారికి తెలిపారు.

## అధికారులు ఎన్నికల విధులకు సంసిద్ధం కండి

*ఓబులవారిపల్లి, అక్టోబర్ 15* ప్రభాతవార్త



రైల్వే కోడూ రు నియోజక వర్గంలో ఎన్నికల కోడ్ నోటిఫికేషన్ రావడంతో. మండలాల్లో ఉన్న మండల స్థాయి అధికారులు.. ఎన్నికల విధుల కు సంసిద్ధం కావాలని ఎం పీడీవో రాజేంద్రసూచించారు. గురువారం ఓబుల వారిపల్లి ఎం పీడీవో కార్యాలయంలో ఓబుల వారిపల్లి తాసిల్దార్ సిద్దేశ్వర రావు, రైల్వే కోడూరు రూరల్ సీఐ డి శ్రీనివాసులు ఆధ్వర్యంలో అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధికారులు ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వచ్చినందున కలెక్టర్ ఆదేశాల మేరకు వారికి కేటాయించిన విధులను తూచా తప్పకుండా పాటించి ఎన్నికలకు విధులకు సంసిద్ధం కావాలని ఎక్కడ ఎలాంటి తప్పు తడకలు లేకుండా గతంలో లాగే రూట్ మ్యాప్, అలాగే పోలింగ్ బూత్ కేంద్రాలు ఎన్నికలకు సంబంధించిన నియమ నిబంధనలను. పాటించి ఎక్కడ సమస్యలు లేకుండా విధులు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఓబులువారిపల్లి మండల స్థాయి అధికారులు సచివాలయ కార్యదర్శులు అధికారులు ఈవోపీఆర్డి ఇంచార్జ్ ఎండిఓ కృష్ణయ్య, ఏపీవో రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

**టీడీపీ మండల అధ్యక్షుడు ఎంజర్ల నారాయణ రెడ్డి**

పెనగలూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త



పెనగలూరు మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకులు పని చేయాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఎంజర్ల నారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం పెనగలూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పార్టీ నాయకులు, మండల కమిటీ సభ్యులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్ ఇన్‌ఛార్జులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, బూత్ ఇన్‌ఛార్జులు మరియు పార్టీ శ్రేణులందరూ సమన్వయంతో, ఐకమత్యంతో పనిచేయాలని చర్చించినట్లు చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో, సమష్టి కృషితో పనిచేసి, పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఈ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగిందన్నారు. సాధ్యమైనంత ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు, పార్టీ నిర్దేశించుకున్న లక్ష్యమైన 100 శాతం విజయాన్ని సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలని ఈ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కట్టావారిపల్లి నాగేశ్వర నాయుడు, కాకి శ్రీరాములు, కొరముట్ల వెంకట సుబ్బయ్య, మొలకల మల్లయ్య, మైనార్టీ నాయకులు షామీర్ బాషా,యువ నాయకుడు ఎంజర్ల సాయి రెడ్డి మరియు తెలుగుదేశం నాయుకులు పాల్గొన్నారు.

## రేంజ్ కార్యాలయాన్ని సందర్శించిన సబ్ డీఎఫ్ఓ

చిట్వేలి, అక్టోబర్ 15 ప్రభాతవార్త:



అటవీ, వన్యప్రాణుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రైల్వే కోడూరు సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ చిదానంద హెచ్ అటవీ శాఖ సిబ్బందికి సూచించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తాను గురువారం చిట్వేలి రేంజ్ కార్యాలయాన్ని సందర్శించి, ఎఫ్ఆర్ఓ పి.ధీరజ్, అటవీ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అటవీ సంరక్షణ, అటవీ ఆక్రమణల నివారణ, ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధం, అటవీ నేరాల నియంత్రణ, వన్యప్రాణుల పరిరక్షణ తదితర అంశాలపై సమీక్షించారు. వన్యప్రాణులకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అటవీ సంపదను కాపాడటంతో పాటు అక్రమ కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు పి. శ్రీనివాసులు, సావిత్రి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు సుబ్బయ్య, చెంగమ్మ, కరీముల్లా, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా ఎంపిపి..జడ్పీటిసి అభ్యర్థులు ఖరారు

కుప్పం, అక్టోబర్ 15 ప్రభాతవార్త



కుప్పం మండలంలో వైకాపా తరపున ఎంపిపి, జడ్పీటిసిగా పోటీచేసే అభ్యర్థులను ఎమ్మెల్సీ, కుప్పం వైకాపా ఇన్‌చార్జ్ భరత్ ఖరారు చేశారు. గురువారం కుప్పం మండలంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎంపిపి అభ్యర్థిగా ఈశ్వర్, జడ్పీటిసి అభ్యర్థిగా హెచ్‌ఎం వనిత శ్రీనులను ఎంపిక చేసినట్లు ప్రకటించారు. పార్టీ శ్రేణులు కూడా ఎంపిటిసి, జడ్పీటిసి, సర్పంచ్ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థుల గెలుపుకు పనిచేయాలని ఎమ్మెల్సీ భరత్ సూచించారు. సమావేశంలో మండల కన్వీనర్ హెచ్ ఎంమురుగేష్, మాజీఎంపిపి హెచ్‌ఎం అశ్విని,నాయకులుచిన్నదొరై,సుందరరాజులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

శాంతిపురం, అక్టోబర్ 15 ప్రభాతవార్త



త్వరలో జరగనున్న ఎంపిటిసి, జడ్పీటిసి, సర్పంచ్ ఎన్నికల్లో తెదేపా అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, కార్మిక బోర్డు సభ్యుడు విశ్వనాథనాయుడు కోరారు. గురువారం స్థానిక న ఒదిగం కళ్యాణ మండపంలో జరిగిన పార్టీ ముఖ్య నేతల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఎంపిక చేసే అభ్యర్థులను 23 పంచాయతీల్లో, 18 ఎంపిటిసి సెగ్మెంట్లు, ఒక జడ్పీటిసి సెగ్మెంట్లో గెలిపించాలన్నారు. నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పనిచేయాలని కోరారు. సమావేశంలో నేతలు గిరిధర్, గోపాల్, చంద్ర, రాజేంద్ర, మధు, రుద్రప్ప, శివ పాల్గొన్నారు.

## అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలి

రామకుప్పం, అక్టోబర్ 15 ప్రభాతవార్త



స్థానిక ఎన్నికల్లో తెదేపా అభ్యర్థుల గెలుపుకు నేతలు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని టిడిపి మాజీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి కోరారు. గురువారం స్థానిక శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద పార్టీ నేతలతో సమావేశమయ్యారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో జరుగుతున్న అభివృద్ధి, ప్రజాసంక్షేమాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో నేతలు న ందారెడ్డి, మునిరెడ్డి, రవిరెడ్డి, మురళీమోహన్, ఆనందప్ప, పెరుమాళ్, శ్రీనాథరెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

## శాంతిపురంలో సర్పంచుల రిజర్వేషన్లు ఇలా !!

శాంతిపురం, అక్టోబర్ 15 ప్రభాతవార్త



మండలంలోని 23 గ్రామ పంచాయతీ సర్పంచుల రిజర్వేషన్లు ఖరారయ్యాయి. 121పెద్దూరు, 64 పెద్దూరు, బండపల్లి, గుంజార్లపల్లి, కెనమాకులపల్లి, కొలమడుగు జనరల్ మహిళకు రిజర్వు చేశారు. అలాగే మొరసనపల్లి, నడింపల్లి, రేగడదిన్నేపల్లి, తుమ్మిశి బిసి మహిళలకు రిజర్వు చేశారు. సొన్నేగానిపల్లి ఎస్సీ, అబకలదొడ్డి, అనికెర, చెంగుబళ్ల, కడపల్లి, కర్లగట్ట, రాళ్లబూదుగూరు జనరల్‌కు రిజర్వు అయ్యాయి. చిన్నారిదొడ్డి, కోనేరుకుప్పం, మఠం,ఎంకెపురం బిసిలకు రిజర్వు చేశారు. దండికుప్పం ఎస్సీ,శివరాంపురం ఎసీ్స మహిళకు రిజర్వు చేశారు.

## వైకాపా నుంచి తెదేపాలో చేరిన మాజీ ఎంపిటిసిలు

బైరెడ్డిపల్లి, అక్టోబర్ 15 ప్రభాతవార్త

మండలంలోని వెంగంవారిపల్లికి చెందిన మాజీ ఎంపిటిసిలు రాజప్పగౌడు, జగదీశ్వర్ గౌడు, అదే గ్రామంకు చెందిన గిరిధర్ గౌడు గురువారం ఎమ్మెల్సీ అమరనాథరెడ్డి సమక్షంలో వైకాపాను వీడి తెదేపాలోకి చేరారు. వారిని ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమాలతో పాటు ఎమ్మెల్యే అభివృద్ధికి చూపుతున్న చొరవతో తాము తెదేపాలో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కిషోర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం శెట్టి, నేతలు తిప్పారెడ్డి, శంకరప్ప, కళ్యాణ్, రమేష్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## కోడూరు మండలంలో జడివాన

రైల్వేకోడూరు రూరల్, అక్టోబర్ 15 ప్రభాతవార్త

రైల్వే కోడూరు మండలంలో గురువారం ఉదయం నుండి రాత్రి వరకు ఏకధాటిగా జడివాన కురుస్తూనే ఉంది. ముఖ్యంగా పదకొండు గంటల తర్వాత వాతావరణం లోని పలుమార్పులతో ఉరుముల, మెరుపులతో జడివాన దంచికొట్టింది. ఎప్పుడైతే ఉరుములు మెరుపులు రావడంతో ఒకసారిగా ప్రజలు ఇళ్లల్లో నుండి బయటికి రావడం మానేశారు. అదేవిధంగా వర్షం రావడంతో ప్రధాన రహదారి వెంబడి భారీగా వర్షం నీరు రావడంతో పాదాచారులకు, వాహనదారులకు పలు రకాల ఇక్కట్లు గురయ్యాయి. ఆర్ఎస్ రోడ్డు నందు భారీగా వర్షపు నీరు రావడంతో పాదాచారులు పలు రకాల ఇక్కట్లకు గురయ్యారు.

## లలితా త్రిపురసుందరిగా శ్రీ భద్రకాళిని.. మోహిని రూపంలో శ్రీవాసవి మాత

చిట్వేలి, అక్టోబర్ 15 ప్రభాతవార్త:





శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం పాత చిట్వేలిలోని శ్రీ భద్రకాళి అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరిగా, చిట్వేలిలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు మోహిని అలంకారంలో, శ్రీ శ్యామలాంబ అమ్మవారు ప్రత్యేక రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారి రూపాలను దర్శించుకున్నారు. లలితా త్రిపుర సుందరి అలంకారం శక్తి, సౌందర్యం, కరుణకు ప్రతీక కాగా, మోహిని అలంకారం విష్ణుమూర్తి మోహినీ రూపంలోని దైవిక సౌందర్యం, ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తుంది. ఈ సందర్భంగా అమ్మవారి శాలలో ఆర్యవైశ్యులు ఉదయం తులాభారం, సాయంత్రం తోట ఉత్సవం, బొమ్మల కొలువు కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తులాభారంలో కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అన్నిచోట్ల ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## నగరి మున్సిపల్ చైర్మన్, వార్డు కౌన్సిలర్ పదవులకు స్వతంత్రంగా పోటీ

చిత్తూరురూరల్, అక్టోబరు 15 ప్రభాతవార్త:



నగరి మున్సిపల్ చైర్మన్ పదవితో పాటు ఒకటో వార్డు కౌన్సిలర్ స్థానానికి స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయనున్నట్లు నగరికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు రామానుజన చలపతి తెలిపారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ టిడిపి బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తున్న తమను పక్కనపెట్టి బయట వ్యక్తులకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. మున్సిపల్ చైర్మన్ పదవికి కోట్లలో బేరసారాలు సాగిస్తున్నారనీ ఆరోపించారు. నాయకులు వ్యవహారశైలి పార్టీ ప్రతిష్టను దిగజార్చేలా వుందని విమర్శించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వార్డుల వారిగా అభ్యర్థులను ఖరారు చేయడం, ఎపార్టీ కోసం శ్రమించిన వారికి తగిన గుర్తింపు ఇవ్వకుండా ఇతరులకు అవకాశాలు కల్పించడం అన్యాయమని పేర్కొన్నారు. చైర్మన్, ఒకటో వార్డు కౌన్సిలర్ స్థానాలకు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగాలని నిర్ణయించినట్లు రామానుజన చలపతి తెలిపారు.

## చిత్తూరు మేయర్ పదవి యాదవులకే ఇవ్వాలి

**– అఖిల భారత యాదవ మహాసభ జిల్లా నాయకుల డిమాండ్**

చిత్తూరురూరల్, అక్టోబరు 15 ప్రభాతవార్త:

నగర మేయర్ పదవిని యాదవులకు కేటాయించాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా నాయకులు డిమాండ్‌చేసారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ న్యాయవాది, టిడిపి సీనియర్ నాయకులు అశోక్‌ఆనంద్‌యాదవ్‌కు అవకాశం కల్పించాలని డిమాండ్ చేసారు. జిల్లాలో యాదవులు అధిక జనాభా కలిగిన సామాజిక వర్గాలో ఒకరనీ, అయినప్పటికీ ప్రత్యక్ష ఎన్నిల ద్వారా కీలక పదవులు దక్కలేదని వాపోయారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో యాదవులు గణనీయ సంఖ్యలో వున్నందున మేయర్ పదవితో పాటు ఐదు కార్పొరేటర్ స్థానాలను కూడా కేటాయించాలని డిమాండ్ చేసారు. సమావేశంలో మహాసభ అధ్యక్షుడు కవితసురేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశుల యాదవ్, ఉపాధ్యక్షులు పయనియాదవ్, కోదండయాదవ్, పట్టణ అధ్యక్షుడు జ్యోతి స్వరూప్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిత్వంపై ఐవిఆర్ఎస్ కాల్స్

**– తొలుత ఐదుమంది.. ఆపై ఇద్దరి గురించి అభిప్రాయ సేకరణ !!**

కుప్పం, అక్టోబర్ 15 ప్రభాతవార్త

కుప్పం మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజలనుంచి అభిప్రాయం తీసుకుంటారని ఆపై సిఎం చంద్రబాబునాయుడు నిర్ణయమే ఫైనల్ అని రెండురోజుల క్రితం 'వార్త'లో కథనం వెలువడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో గురువారం కుప్పం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న ఐదుమంది పేర్లను పేర్కొంటూ ప్రజలకు ఐవిఆర్ఎస్ కాల్స్ వచ్చాయి. శారదమ్మ, ప్రశాంత్, రాజ్‌కుమార్, వెంకటేష్, కన్నన్‌ల పేర్లకు సంబంధించి ప్రజల అభిప్రాయం సేకరించారు. అనంతరం రాజ్‌కుమార్, వెంకటేష్ పేర్లకు సంబంధించి మరలా ఐవిఆర్ఎస్ కాల్స్ వచ్చాయి. ప్రజలు తమకు నచ్చిన నాయకులకు కేటాయించిన నెంబర్లను నొక్కి తమ అభిప్రాయం తెలియజేశారు.

## ఎస్పీచే నామినేషన్ కేంద్రం పరిశీలన



కుప్పం, అక్టోబర్ 15 ప్రభాతవార్త

కుప్పం మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో కుప్పం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు కుప్పం ఎఎస్పీ బి.హేమంత్ గురువారం పరిశీలించారు. ఈనెల 16–18 తేదీల మధ్య నామినేషన్ల స్వీకరణ ఉండడంతో నామినేషన్ కేంద్రం వద్ద తీసుకోవాల్సిన భ ద్రత ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, నాయకుల రాకపోకలు, శాంతిభద్రతల చర్యలను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని కమీషనర్ శ్రీనివాసరావు, అర్బన్ సిఐ జి.టి.నాయుడుకు సూచించారు. ఎన్నికల సందర్భంగా పోలీసు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎన్నికల నియమావళికి అనుగుణంగా అవసరమైన భ ద్రతా చర్యలకై ఆదేశించారు. కార్యక్రమంలో కడ ఎపిడి శ్రీనివాసులురాజు, ఎస్సైలు పాల్గొన్నారు.

## యువతకు స్ఫూర్తి ప్రదాత అబ్దుల్ కలాం

**– బిసిఎన్ గ్రూప్స్ చైర్మన్ డాక్టర్ బిసి నాగరాజ్**




కుప్పం, అక్టోబర్ 15 ప్రభాతవార్త

దేశ యువతకు స్ఫూర్తి ప్రదాత దివంగత రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలామ్ అని బిసిఎన్ గ్రూప్స్ చైర్మన్ డాక్టర్ బిసి నాగరాజ్ పేర్కొన్నారు. గురువారం కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూజలు చేసి ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అబ్దుల్ కలామ్ జీవితాన్ని ప్రేరణగా తీసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకుసాగాలని సూచించారు. సాధారణ పేద కుటుంబంలో పుట్టి అంచెలంచెలుగా ఎదిగిన కలామ్ దేశ రాష్ట్రపతిగా అత్యున్నతస్థాయికి ఎదిగారన్నారు. ఆయన నిరాడంబర జీవితం ఎందరికో ఆదర్శమన్నారు. ఇలాంటి మహనీయుల అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్,ఆర్‌అండ్‌డి డైరెక్టర్ డాక్టర్ కోదండరామయ్య, ఎన్‌ఎస్‌ఎస్ పిఓ గంగాధర్,కోఆర్డినేటర్ డాక్టర్ అరుణ్‌కుమార్, పిఆర్వో ప్రవీణ్‌కుమార్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## పక్కాగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు

చిత్తూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త:

జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎలక్షన్ కమీషన్ జారీ చేసిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ప్రభుత్వ భవనాలు, విద్యుత్ స్తంభాలు, బహిరంగ ప్రదేశాల్లో ఎలాంటి రాజకీయ ఫెక్సీలు, పోస్టర్లు, బ్యానర్లు, వాల్ రాతలు వుండరాదన్నారు. అలాగే ఓటర్లకు నగదు, మద్యం, బహుమతులు పంచడం, ఉచితంగా వస్తువులు పంపిణీ చేయడం తీవ్ర నేరమన్నారు. అలాగే కులాల, మతాల మధ్య విద్వేషాలు రేకెత్తించేలా, వ్యక్తిగత దూషణలతో ప్రసంగాలు చేయడం పూర్తి నిషేధం అన్నారు. అలాగే ప్రార్థనా మందిరాలైన దేవాలయాలు, మసీదులు, చర్చీలను ప్రచార వేదికలుగా ఉపయోగించరాదన్నారు. అలాగే అధికార పక్షం వారు ప్రభుత్వ వాహనాలు, నిధులు, భవనాలు, ప్రభుత్వ పథకాల ప్రచారాలను ఎన్నికల ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదన్నారు. అలాగే ఓటర్లను ఆకట్టుకొనేలా కొత్త ప్రభుత్వ పథకాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, కొత్త నిధులు మంజూరు చేయదన్నారు. అలాగే రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు మైకులు, లౌడ్ స్పీకర్లు వాడకూడదని, పగటి పూట ముందస్తు అనుమతి తీసుకుని మైకులు, లౌడ్ స్పీకర్లు ఉపయోగించుకోవచ్చునన్నారు. అలాగే సరైన ఆధారాలు, పత్రాలు లేకుండా రూ.50 వేల కంటే ఎక్కువ నగదును రవాణా చేయకూడదని కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టం చేశారు.

## ప్రణాళిక బద్ధంగా మున్సిపల్ ఎన్నికలకు బందోబస్తు



సూళ్లూరుపేట, అక్టోబర్ 15 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలో నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ప్రణాళిక అబద్ధంగా పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక సీఐ ఎం మురళీకృష్ణ వెల్లడించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన, ఓటర్లను బెదిరించి ప్రలోభ పెట్టిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ప్రశాంత కరమైన వాతావరణంలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆ కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘాతో పాటు బందోబస్తును పటిష్టంగా ఉండే విధంగా చర్యలు చేపట్టినట్లు ఆయన వివరించారు. రౌడీ షీటర్లను గుర్తించి వారిని ఇప్పటికే బైండోవర్ చేయడం జరిగిందని అన్నారు. మున్సిపాలిటీలోని 32 వార్డులకు సంబంధించి 24 పోలింగ్ లొకేషన్లో 55 పోలింగ్ కేంద్రాలలో ఐదు మంది ఎస్ఐలతో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి నిరంతరం నిఘాతోపాటు బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. 50 వేలకు మించి నగదు ఎవరు తీసుకువెళ్ళకూడదని ఆయన తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకారం అందించాలని సిఐ కోరారు.

### నేటి నుంచి...

## మున్సిపల్ నామినేషన్ల స్వీకరణ

సూళ్లూరుపేట, అక్టోబర్ 15 ప్రభాతవార్త : మున్సిపాలిటీకి సంబంధించి శుక్రవారం నుంచి నామినేషన్లను స్వీకరించే ప్రక్రియను చేపట్టనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ 19వ తేదీ నామినేషన్ల పరిశీలన, 21వ తేదీ మూడు గంటల్లోగా నామినేషన్ ఉపసంహరణ చేసుకోవచ్చుని మున్సిపల్ కమిషనర్ కే చిన్నయ్య తెలిపారు. చైర్ పర్సన్ నామినేషన్లను మున్సిపల్ కార్యాలయంలో స్వీకరిస్తారు. అలాగే ఒకటి నుండి నాలుగు వార్డులకు అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని 8 బి క్లాస్ రూమ్‌లో స్వీకరిస్తారు. జూనియర్ కళాశాల ఆవరణంలోని ఐఎంటిపి బ్లాక్‌లో కౌంటర్ నెంబర్ 1లో ఐదు నుంచి 8 వార్డులు, కౌంటర్ నెంబర్ 2లో తొమ్మిది నుంచి 12 వార్డులు నామినేషన్లను స్వీకరించే ఏర్పాటు చేశారు. అలాగే మన్నారు పోలురులోని సచివాలయంలో 13 నుంచి 16 వార్డు వరకు, గమళ్ళ వీధిలోని శ్రీ శక్తి భవన్లో కౌంటర్ నెంబర్ వన్‌లో 17 నుంచి 20 వార్డులు, కౌంటర్ నెంబర్ టులో 21 నుంచి 24 వరకు, విఎస్ఎస్‌సి ప్రభుత్వ డిగ్రీ కళాశాల రూమ్ నెంబర్ 108లో 25 నుంచి 28 వార్డులు, 29 నుంచి 32 వార్డులకు సంబంధించి నామినేషన్లు స్వీకరించే ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వెల్లడించారు.

# సూళ్లూరుపేట డివిజన్

## సూళ్లూరుపేట మండల పంచాయతీల రిజర్వేషన్లు

సూళ్లూరుపేట, అక్టోబర్ 15 ప్రభాతవార్త: మండలానికి సంబంధించి 19 పంచాయతీల రిజర్వేషన్లను అధికారులు గురువారం ఖరారు చేశారు. ఆబాక ఓసి జనరల్,దామా నెల్లూరు ఎస్సీ, దామరాయి ఎస్సీ, గోపాల్‌రెడ్డిపాలెం ఓసి మహిళ, ఇఠాపూరుఓసి మహిళ, కేసీఎన్ గుంట ఎస్సీ, కడపత్ర ఓసి జనరల్, కొరిడిఎస్సీ మహిళ,కోట పోలూరు ఓసి జనరల్, కుదిరి ఎస్సీ మహిళ, మంగళంపాడు ఓసి జనరల్, మంగా నెల్లూరు ఎస్సీ మహిళ, మన్నే ముత్తేరి ఓసి మహిళ, మతకముడి ఎస్టి, నాదెళ్ల వారి కండ్రిగ ఓసి జనరల్, సామంత్ మల్లం ఓసి మహిళ, సున్నపల్లి ఎస్సీ, ఉగ్గుముడి ఎస్టి మహిళ, వెలగల పొన్నూరు ఎస్సీ మహిళలకు కేటాయిస్తూ రిజర్వేషన్లను ఖరారు చేశారు.

## మండల పరిషత్ అధ్యక్ష పదవి రేసులో వాణి



బాలాయపల్లి, అక్టోబర్ 15 ప్రభాతవార్త: బాలాయపల్లి మండల పరిషత్ అధ్యక్ష పదవిని జనరల్ మహిళకు కేటాయించారు. దీంతో మండల టిడిపి అధ్యక్షులు రాయి సత్యం నాయుడు సతీమణి రాయి వాణి టిడిపి నుండి పోటీ చేయనున్నారు. రాయి సత్యం నాయుడు తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షులుగా ఉన్నారు. టిడిపి పార్టీ అభివృద్ధి కోసం ఆయన ఎంతకాలం కృషి చేశారు. వాణి మండల పరిషత్ అధ్యక్ష పదవికి పోటీపడుతున్నారు.

## శ్రీ పార్వతీ దేవికి శ్రీబాలా త్రిపుర సుందరి దేవి అలంకారం



సూళ్లూరుపేట, అక్టోబర్ 15 ప్రభాతవార్త: శ్రీ నాగేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రుల భాగంగా గురువారం అమ్మవారికి శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అలంకారాన్ని చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే అమ్మవారికి గాజులతో ప్రత్యేకంగా అలంకారం చేశారు.ప్రత్యేక అలంకారానికి సూళ్లూరుపేటకు చెందిన చిట్టేటి పెరుమాళ్ళు, గోవిందమ్మ దంపతులు ఉభయ కర్తలుగా ఉన్నారు. అలాగే సాయంత్రం అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. దేవస్థాన చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి, ప్రధాన అర్చకులు పేటేటి సునీల్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

## మూడు కేంద్రాలలో నామినేషన్ల స్వీకరణ : కమిషనర్



వెంకటగిరి, అక్టోబర్ 15 ప్రభాతవార్త: మున్సిపాలిటీలోనే 36 వార్డులకు గాను మూడు కేంద్రాల్లో ఈ నెల 16వ తేదీ నుండి నామినేషన్‌లో స్వీకరిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కిరణ్ తెలిపారు. నామినేషన్ల స్వీకరించే మున్సిపల్ కార్యాలయం, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశా లలను సీఐ రోశయ్య,తహసిల్దార్ పి.శిరీష, ఎస్సై ఖాదర్బాషా పరిశీలిం చారు. మున్సిపల్ చైర్మన్ పదవి ప్రత్యేకంగా నామినేషన్ల స్వీకరిస్తామని తెలిపారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ స్వీకరిస్తామని చెప్పారు. నామినేషన్ కేంద్రాల దగ్గరకు నామినేషన్ వేసే వారిని తప్ప ఇతరులను ఎవరిని రానివ్వమని సిఐ రోశయ్య తెలిపారు. ర్యాలీలుగా వచ్చేవారు 100 మీటర్లకు దూరంగా ఉండాలని చెప్పారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## నిష్పక్షపాతంగా జరిగేలా చర్యలు తీసుకోండి : ఎంపీ

వెంకటగిరి, అక్టోబర్ 15 ప్రభాతవార్త: స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ మద్దిల గురుమూర్తి కోరారు. ఈ మేరకు ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు, బెదిరింపులు ఎదురుకాకుండా తగిన భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టరు ఎస్పీలకు లేఖ రాశారు. అక్టోబర్ 14న జారీ చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్‌ను ప్రస్తావిస్తూ, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో తిరుపతిలో డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా చోటు చేసుకున్న దుర్ఘటనలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంపీ కోరారు. నామినేషన్ కేంద్రాల వద్ద తగినంత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, అభ్యర్థులు ఎలాంటి అడ్డంకులు లేకుండా నామినేషన్లు దాఖలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీకి విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి



సూళ్లూరుపేట, అక్టోబర్ 15 ప్రభాతవార్త: భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జన్మదిన వేడుకలను గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు ఉస్మాన్ భాష మాట్లాడుతూ 2016లో మిస్సైల్ మెన్‌గా పేరొందిన డాక్టర్ అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం విద్యార్థులు ఆయన అందించిన స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎం చంద్రబాబు, డి. సురేష్, ఉపాధ్యాయులు సైఫుల్ల, చలపతి భవిత పాఠశాల విద్యార్థులు యశ్వంత్, చందన్‌ల చేతుల మీదుగా అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలను సమర్పించారు.

## జనసేన పార్టీకి రాజీనామా!



వెంకటగిరి, అక్టోబర్ 15 ప్రభాతవార్త : సీనియర్ జనసేన పార్టీ నాయకులు గూడూరు వెంకటేశ్వర్లు ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. తాను పది సంవత్సరాల నుండి జనసేన పార్టీలో జెండా మోసి పార్టీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశానని చెప్పారు. పార్టీలో తనకు ఎలాంటి మేలు జరగకపోగా అవమానాలు ఎదురయ్యానని వాపోయారు. జనసేన పార్టీలో పార్టీ కోసం కష్టపడే వారికి మేలు జరగడం లేదని చెప్పారు. కనుక పార్టీకి రాజీనామా చేసినట్లు చెప్పారు. అందరితో చర్చించి భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తానని తెలిపారు.

## కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### - మండల పార్టీ అధ్యక్షులు చంద్రమౌళి రెడ్డి



వెంకటగిరి, అక్టోబర్ 15 ప్రభాతవార్త: స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలని మండల పార్టీ అధ్యక్షులు పప్పు చంద్రమోళి రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సూచనల మేరకు టిడిపి కార్యాలయంలో మండలంలోని నాయకులతో ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ, జడ్పిటిసి, సర్పంచుల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఎంపీపీ, జడ్పిటిసిలను కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. ఇంకా పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సమావేశంలో నాయకులు ముద్దా మురళి గౌడ్, రామచంద్రయ్య పాల్గొన్నారు.

## నగరిలో టిడిపి జెండా ఎగురవేద్దాం

### కె.జె.కుమార్ టిడిపి కుటుంబ సభ్యుడు-ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్



పుత్తూరు(నగరి), అక్టోబరు 15 ప్రభాతవార్త : స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ క్యాడరంతా కలిసి కట్టుగా పనిచేసి నగరి మునిసిపాలిటీలో టిడిపి జెండా ఎగురవేయాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ పిలుపునిచ్చారు. గురువారం నగరి టిడిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపికి చెందిన మునిసిపల్ మాజీ ఛైర్మన్ కె.జె.కుమార్, ఆయన కుటుంబ సభ్యులు, అనుచరులంతా తెలుగుదేశం పార్టీలో చేరినట్టు ప్రకటించారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో పార్టీ కండువా కప్పుకుంటారని స్పష్టం చేశారు. ఆ మేరకు గురువారం నుంచి కె.జె.కుమార్ టిడిపి కుటుంబ సభ్యుడేనని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కుమార్‌తో పాటు ఆయన వర్గమంతా తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేస్తారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 80 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గత ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను ఇబ్బంది పెట్టిందని, పలు చోట్ల గెలిచిన వారిని ఓడినట్టుగా ప్రకటించిన దారుణాలు జరిగాయని తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహిస్తోందని తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికల్లో సైకిల్, గ్లాస్, కమలం గుర్తులకు ఓట్లేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో భారీ స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయన్నారు. అభివృద్ధిని కాంక్షించే వారంతా కూటమి అభ్యర్థులకు ఓట్లేయాలని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విధుల నిర్వహణకు వివరాలు సకాలంలో సమర్పణ

### - ఉద్యోగులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

చిత్తూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త: జిల్లాలో ఎన్నికల విధుల నిర్వహణకు అవసరమైన మానవ వనరుల వివరాలను సకాలంలో సేకరించి, పూర్తి సమాచారంను ఎక్సెల్ షీట్‌లో సమర్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా స్థాయి శాఖాధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ఎన్నికల విధుల కేటాయింపుకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల నిర్వహణకు అవసరమైన ఉద్యోగుల వివరాల సేకరణ కోసం ఇప్పటికే డిఇఓలు, పిఓలు, సమగ్ర శిక్ష తదితర విభాగాల సిబ్బందికి బాధ్యతలు అప్పగించామన్నారు. అయినప్పటికీ కొన్ని శాఖల నుండి ఉద్యోగుల వివరాలు పూర్తి స్థాయిలో అందలేదన్నారు. ప్రతి శాఖ అధికారి తమ కార్యాలయంతో పాటు క్షేత్ర స్థాయి, మండల స్థాయిలో పని చేస్తున్న ఉద్యోగుల వివరాలను సేకరించి జిల్లా ఎన్నికల కార్యాలయం అందించిన ఎక్సెల్ షీట్‌లో పూర్తి సమాచారంను నమోదు చేసి సమర్పించాలన్నారు. ఉద్యోగుల వివరాల సేకరణలో ఎలాంటి పక్షపాతం లేకుండా అన్ని శాఖల్లో పని చేస్తున్న అర్హులైన సిబ్బంది వివరాలను నమోదు చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది, శిక్షణ షెడ్యూళ్ళు, ఇతర ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. చిత్తూరు, కుప్పం, పలమనేరు ప్రాంతాల్లో శిక్షణ నిర్వహించడానికి సంబంధిత శాఖలు ముందస్తు ఏర్పాట్లు తీసుకోవాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ హాజరయ్యారు.

## వ్యవసాయ రంగంపై మహిళలు దృష్టి సారించాలి : ఏడిఏ



వెంకటగిరి, అక్టోబర్ 15 ప్రభాత వార్త: వ్యవసాయ రంగంపై కూడా మహిళలు దృష్టి సారించాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు అనసూయ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో రైతు మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మాట్లాడుతూ మహిళా రైతులు నీటి నిలవపై దృష్టి సారించాలని తెలిపారు. దేశ ప్రగతిపై మహిళలు మైలూ రాళ్ల వంటి వారిని తెలిపారు. కెవికె అధిపతి ప్రతాప్ మాట్లాడుతూ ఎల్‌నీనో ప్రభావం వల్ల నీటి సమస్య ఎక్కువగా ఉందని రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని తెలిపారు. వర్షాలు లేనందున వరి తదితర పంటల సాగు కష్టమవుతుందని చెప్పారు. మహిళా రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. మహిళా రైతులకు ఆటలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కె.వి.కె శాస్త్రవేత్తలు విజయశ్రీ, డాక్టర్ రాజీవ, వ్యవసాయ టెక్నికల్ అధికారిని ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన మరగదాంబిగా అమ్మవారు



కాణిపాకం, అక్టోబర్ 15 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంబిగా సమేత మణికంఠేశ్వరాలయంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు గురువారం మరగదాంబిగా అమ్మవారు శ్రీగాయత్రిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా ఆలయంలో ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్ ఆధ్వర్యంలో అర్చక స్వాములు స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి దూపదీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం అమ్మవారిని శ్రీగాయత్రిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈసందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి మొకు ్కలు తీర్చుకున్నారు. అలాగే సాయంత్రం ఆలయ మండపంలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అలాగే రాత్రి అలంకరించిన అమ్మవారిని ప్రత్యేక పల్లకిపై వుంచి మంగళవాయిద్యాల నడుమ కాణిపాకం పురనవీధుల ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన జాయింట్ కలెక్టర్



సూళ్లూరుపేట, అక్టోబర్ 15 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలో నిర్వహించినున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి స్థానిక జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను, నామినేషన్ కేంద్రాలను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు పరిశీలించారు. ఆయన స్థానిక అధికారులకు పలు కీలకమైన సూచనలు చేశారు. బందోబస్తు, పోలింగ్ కేంద్రాల నిర్వహణ వంటి అంశాలపై అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డీవోవి దేవేందర్ రెడ్డి, నాయుడుపేట డిఎస్పి జి చెంచుబాబు, సిఐ ఎం మురళీకృష్ణ, ఎస్సై జి అజయ్ కుమార్, కమిషనర్ కే చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## లలితాత్రిపురసుందరిగా గంగమ్మ





తిరుపతి,అక్టోబర్ 15ప్రభాతవార్త: తిరుపతి గ్రామదేవత తాతయ్య గుంట గంగమ్మ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో గురువారం గంగమ్మను లలితాత్రిపురసుందరిదేవిగా అలంకరించారు. ఉదయం అభిషేకం, హోమం కుంకుమార్చన వైభవంగా జరిగింది. రాత్రి 7 గంటలకు ఊంజల్‌సేవలో అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్ ,ఈఓ ఎ. జయకుమార్ సౌకర్యాలు కల్పించారు. శ్రీచక్ర అధిష్ఠాన దేవతగా, పంచదశాక్షరీ మంత్రానికి అధిదేవతగా లలితా దేవిని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. ప్రకృతి శక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని ఈ రోజు దర్శించుకుంటే సకల సంపదలు, సౌభాగ్యాలు చేకూరుతాయని, మోక్షం సిద్ధిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

## భక్తులకు మెరుగైన సేవలందించడమే ప్రథమ కర్తవ్యం

### -వర్షాల నేపథ్యంలో విపత్తుల నిర్వహణకు అప్రమత్తంగా ఉండాలి
### -టిటిడి అదనపు ఈఓ వెంకయ్య చౌదరి




తిరుమల,అక్టోబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశిష్టమైన నేడు జరగనున్న గరుడసేవను సమష్టి కృషితో విజయవంతం చేయాలని టిటిడి అదనపు ఈఓసీహెచ్ వెంకయ్య చౌదరి పిలుపునిచ్చారు. స్వామివారిపై అపార విశ్వాసంతో తిరుమలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు సంతృప్తికరమైన దర్శనం, వాహనసేవను కల్పించడమే ప్రతి ఉద్యోగి ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. తిరుమలలోని ఆస్థాన మండపంలో గురువారం సాయంత్రం గరుడసేవ విధులకు నియమించిన సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టిటిడి ఉద్యోగులు, విజిలెన్స్, పోలీసు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో మరింత ఉత్సాహంగా, అంకితభావంతో పనిచేసి గరుడసేవను విజయవంతం చేయాలని సూచించారు. వాతావరణ శాఖ వర్ష సూచనలు చేసిన నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వర్షం వల్ల ఎదురయ్యే పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు విపత్తుల నిర్వహణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లోనే బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అదనపు ఈఓ సూచించారు. గరుడసేవకు వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు సౌకర్యవంతమైన దర్శన అనుభవాన్ని అందించి టిటిడి ప్రతిష్ఠను మరింత పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జేఈఓలు డాక్టర్ ఎ. శరత్, ప్రభల గోపీనాథ్, సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ, ఎస్పీ లంకెల సుబ్బరాయుడు,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, అన్నప్రసాదం క్యాటరింగ్ అధికారి శాస్త్రి పాల్గొన్నారు.

## స్కందమాత ఆలంకరణలో ఏడుగంగమ్మల ఆలయం



శ్రీకాళహస్తి,అక్టోబర్ 15 ప్రభాతవార్త: పట్టణంలోని ఆలయాల్లో దసరా సంబరాలు మిన్ను ముట్టుతున్నాయి. శ్రీకాళహస్తీశ్వరాలయం లోనూ, అనుబంధ ఆలయాల్లోనూ వివిధ అలంకరణలతో భక్తులను ఆకట్టుకుంటున్నారు. ఈ నేపధ్యంలో ముత్యాలమ్మ గుడివీదిలోని ఏడుగంగమ్మల స్థావరం వద్ద వెలసిన అమ్మవారికి గురువారం ఆమ్మవారికి స్కంద మాత అలంకరణ నిర్వహించారు. ఆలయంలోని జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారి సన్నిధికి ఎదురుగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులో అమ్మవారికి స్కంద మాతదేవి ఆలంకారం జరిపారు. ముత్యాలమ్మ ఆలయంలో మహాచండి దేవి అలంకారం జరిపారు. బంగారమ్మ ఆలయంలో వెలసిన అమ్మవారికి బ్రహ్మ చారిణి అలంకారంతో ఆకట్టుకునేటట్లు తీర్చి దిద్దారు. కాగా ఉప్పు వీధిలో వెలసిన శ్రీవాసవి కన్యకారపరమేశ్వరి అమ్మవారిని ప్రత్యంగిలా దేవి అలంకారంతో ముస్తాబు చేసారు. పట్టణంలోని బజారువీధిలో వెలసిన శ్రీ వాసవి కన్యకారపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక అలంకార దాత పొట్టి చంద్రగుప్తాసన్స్‌లు శ్రీనివాసపెరుమాళ్, గరుడ సేవ అలంకారాన్ని నిర్వహించారు. ఉభయదాతులు పాల్గొనగా ఉత్సవాలు కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు.



### వారాహి మాతాగా శ్రీశ్రీశ్రీ అంకాలమ్మ:

శ్రీకాళహస్తి పట్టణంలోని పి.వి.రోడ్డులో వెలసియున్న శ్రీశ్రీశ్రీ అంకాలమ్మ దేవస్థానంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఓ అలంకారంతో భక్తులను ఆకట్టుకుంటున్నారు. ఈ సందర్భంగా గురువారం శ్రీశ్రీశ్రీ అంకాలమ్మకు వారాహి మాతా అలంకారంతో వున్న అమ్మవారిని భక్తులు విశేషంగా దర్శించి, మొక్కులు తీర్చుకున్నారు.

## కుప్పం మున్సిపోల్స్‌కు నేటినుంచే నామినేషన్లు

### -18వతేది వరకు స్వీకరణ... మున్సిపల్ కార్యాలయంలో కౌంటర్లు



కుప్పం, అక్టోబర్ 15 ప్రభాతవార్త: కుప్పం మున్సిపల్ ఎన్నికలకు సంబ ంధించి శుక్రవారం తొలి ఘట్టంకు అడుగుపడనుంది. శుక్ర వారం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు అభ్యర్థుల నుంచి అధికారులు నామినేషన్ పత్రాలను స్వీకరిస్తారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల దాకా నామినేషన్లను ఎన్నికల అధికారులు స్వీకరిస్తారు. 21వతేది మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి కుప్పం మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ల కేంద్రాన్ని అధికారులు ఏర్పాటుచేశారు. మొదటి అంతస్తులో 32 వార్డులకు సంబంధించి అధికారులు నామినేషన్ల స్వీకరణకు వేర్వేరు కౌంటర్లు ఏర్పాటుచేశారు. కాగా గురువారం ఉదయం నుంచి కుప్పం మున్సిపల్ కార్యాలయం సందడిగా కన్పించింది. శుక్రవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ఉండడంతో ఆయా పార్టీల తరపున బరిలో దిగాలనుకుంటున్న నాయకులు, వారి అనుచరులు మున్సిపల్ కార్యాలయంకు వచ్చి నామినేషన్ దాఖలు పత్రాలు తీసుకెళ్లడం కన్పించింది. అలాగే నామినేషన్లతో పాటు అందించాల్సిన ఇతర వివరాల గురించి అధికారులను కలసి వాకబు చేస్తూ కన్పించారు.

## మహాంకాళి మాత అలంకారంలో శ్రీ వాసవి అమ్మవారు



శ్రీకాళహస్తి,అక్టోబర్ 15 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని బజారు వీధిలో వెలసిన అమ్మవారికి మహాంకాళి మాత ప్రత్యేకాలంకారం నిర్వహించారు. అలంకారానికి ఉభయదారులుగా ఉక్కరపు ప్రకాష్‌రావు, మంజూలూరు జి.బాలాజి, బొమ్మశెట్టి కొటయ్య, జూలుగంటి శ్రీధర్‌కుమార్ గుప్తా, సనిశెట్టి ఆదినారాయణ, పొట్టి నాగశంకర్‌గుప్తా, ముల్లంగి ప్రకాష్, ముచ్చేలి ప్రసాద్ సాయంత్రం ఉభయదారులుగా బుచ్చినాగేశ్వరరావు,తేర్ల నరసింహామూర్తిజ్ఞాపకార్థం కుమారుడు నరసింహా మహేష్, పొట్టి అనూరాధమ్మ, పొట్టి చంద్రగుప్తా, పొట్టి ప్రసాద్‌లు వ్యవహారించారు.

# శ్రీకాళహస్తి డివిజన్

## డ్రిప్ మోటార్ పైపులు చోరీ !



బుచ్చి నాయుడు కండ్రిగ 15 ప్రభాతవార్త: భూమిని నమ్ముకుని వ్యవసాయమే ఆధారంగా లాభనష్టాలను పక్కన పెట్టి ఉన్న దానిలో వ్యవసాయ సాగుకు రుణాలు తీసుకొని చేసుకుందామంటే వ్యవసాయ పొలంలో గుర్తుతెలియని దుండగులు డ్రిప్పు మోటర్లు పైపులైను చోరీకి పాల్పడంతో రైతులు దిక్కు చూస్తున్న స్థితిలో ఆందోళనతో అల్లాడుతున్నారు. మండలంలో అనేకసార్లు వ్యవసాయ మోటర్లు చోరీకి గుర్తు తెలియని దుండగులు పాల్పడుతున్న నేటికీ సంబంధిత పోలీసు శాఖ అధికారులు గుర్తించలేకపోతున్నారు. మండలంలోని గాజుల పెళ్లూరు రెవెన్యూ గ్రానైట్ ఫ్యాక్టరీ సమీపంలోని వాటంభేటీ రాము రైతు వ్యవసాయ భూముల్లో బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు మిరప సాగు పంట కొరకు ఏర్పాటుచేసిన డ్రిప్ మోటర్ పైప్ లైన్లను చోరీకి పాల్పడినట్లు రైతు రాములు తెలిపారు దళితుడు వికలాంగుడు వ్యవసాయ శాఖను నమ్ముకున్న పేద కుటుంబం. మిరప పంట సాగు కొరకు ప్రస్తుతానికి సుమారు లక్ష రూపాయలు దాకా ఖర్చయిందని, పంట సాగు చేసే సమయంలో చోరీకి గురి కావడంతో దిక్కు తోచని స్థితిలో రైతు ఆందోళన చెందుతున్నాడు. పెట్టిన పెట్టుబడులకు రాబడి వస్తుందా లేదా అని ఆందోళన చెందుతున్న రైతులకు ఈ చోరీలు వలన భయాందోళన చెందుతున్నారు పంట సాగు చేసినప్పటి బీడ పేడ తెగులు నుంచి పంటలు సాగు చేస్తే ప్రకృతి అనుకూలంగా ఉంటే అన్ని బాగా పంట సాగు లాభ సాటిగా ఉంటుంది, లేకుంటే ప్రకృతి వైపరీత్యాల వలన ఒక్కోసారి పంట నష్టం కూడా జరుగుతుంది. అష్ట కష్టాలు పడి పంటను పోగు చేస్తే గిట్టుబాటు ధరలు లేక తక్కువ ధరలకే అమ్మవలసిన పరిస్థితి. వ్యవసాయ పంట పొలాల్లో తరచూ జరుగుతున్న మోటార్ల చోరీలను అధికారులు చర్యలు చేపట్టాలి. అలాగే పంట పొలాల్లో దుండగులు చోరీతో నష్టపోయిన రైతులు కూడా వ్యవసాయ సాగు విషయంలో ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని రైతులు కోరుతున్నారు

## సమన్వయంతో పని చేద్దాం...విజయం సాధిద్దాం

### -ఎంఎల్ఏతో జనసేన నాయకుల భేటి



శ్రీకాళహస్తిరూరల్,అక్టోబర్ 15 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి స్థానిక సంస్థల ఎన్నికల్లో సమన్వయంతో పని చేసి విజయం సాధిద్దామని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం జనసేన నాయకులు శాసనసభ్యుని కలసి సత్కరించారు. ఈ సందర్భంగా బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ నేడు కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తున్నామని ఈ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని పిలుపు నిచ్చారు. గతంలో పరిపాలించిన వైకాపా నాయకుల పాలనలో సర్పంచ్‌లు ప్రజా ప్రతినిధుల పరిస్థితి గమనించాము కాదా నేడు కూటమి వచ్చిన తరువాత గ్రామాల అభివృద్ధియే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాము. కూటమిలో ఎక్కడ ఎవరికి అవకాశం వచ్చినా సమన్వయంతో పని చేసి విజయమేలక్ష్యంగా గెలిపించు కుందామని సూచించారు. నేడు కూటమి వచ్చిన తరువాత చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేసి ఓట్లు అడుగుదామని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా జనసేన తిరుపతిపార్లమెంటు సమన్వయకర్తలు వెంకటేశ్వర్లు, శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త దండి నరేంద్ర, ఈగల హరిబాబు రాయల్, మిద్దెల హరిలు ఉన్నారు. తెలుగుదేశం నాయకులు గాలిచలపతి నాయుడు,గుమ్మడి దశరధాచ్చారి, తాటిపర్తి రవీందద్రరెడ్డి, బిజెపికి చెందిన రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఆ రెండు పంచాయతీలు మున్సిపాలిటికే!

శ్రీకాళహస్తి,అక్టోబర్ 15 ప్రభాతవార్త: పట్టణానికి సమీపంలోని మండలంలోని రెండు పంచాయతీలకు ఎన్నికల్లేదని జిల్లా పంచాయతీ అధికారి గురువారం స్పష్టం చేసారు. శ్రీకాళహస్తి మండలంలోని ఉడమలపాడు పంచాయతీలోని కొంత భాగం, తొట్టంబేడు మండలంలోని తొట్టంబేడు పంచాయతీలోని కొంత భాగం మున్సిపాలిటిలో విలీనం అయినందువల్ల ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం రెండు పంచాయతీలకు రిజర్వేషన్ కేటాయించలేదన్నారు. రాష్ట్ర ఎన్నికల ఆదేశానుసారం, ఈ రెండు గ్రామ పంచాయతీలకు ఓటర్లు లిస్టు ప్రచురించిన తరువాత రిజర్వేషన్లు ఖరారు చేస్తామని జిల్లా అధికారి సుశీలాదేవి ఓ ప్రకటనలో తెలిపారు.

## పెట్రోల్ బంక్ గోడ కూలి మహిళకు గాయం

### -బాధితురాలికి అండగా సహకార బ్యాంకు



తొట్టంబేడు, అక్టోబర్ 15 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలం తంగేళ్లపాలెం సింగిల్ విండో సహకార బ్యాంకు ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంక్ కాంపౌండ్ వాల్ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కూలిపోయిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. వరద నీరు చేరి మట్టి కోతకు గురికావడంతో కాంపౌండ్ వాల్ లో కొంత భాగం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో కాంపౌండ్ వాల్ పక్కనే నివాసం ఉంటున్న స్థానిక మహిళకు స్వల్పంగా గాయాలయ్యాయి. పెద్ద పెద్ద కాంక్రీట్ దిమ్మెలు విరిగిపడటంతో పాటు విద్యుత్ స్తంభాలు కూడా ఒరిగినట్లు స్థానికులు తెలిపారు. అదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. గోడ కూలిన శబ్దానికి చుట్టుపక్కల వారు పరుగు పరుగున సంఘటన స్థలానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న వెంటనే బ్యాంక్ సిబ్బంది, బ్యాంక్ చైర్మన్ సీఈవో కమిటీ సభ్యులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గాయపడిన మహిళను వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించే ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ యాజమాన్యం తరపున గాయపడిన మహిళకు ఆసుపత్రి ఖర్చులు పూర్తిగా భరిస్తామని, జరిగిన ఆస్తి నష్టానికి తగిన నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా కూలిపోయిన నిర్మాణ స్థలంలో భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టంగా పిల్లర్లతో తిరిగి నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. బాధితులకు నష్టపరిహారం ప్రకటించడంపై గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని... సందర్శించిన కేఎంప ప్రోగ్రాం ఆఫీసర్



బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబర్ 15 ప్రభాతవార్త: బి.ఎన్. కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేఎంప ప్రోగ్రాం ఆఫీసర్ రాజు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ ను కలిసి జనని పోర్టల్ లో ఆశా కార్యకర్తల మ్యాపింగ్ పురోగతిని అడిగి తెలుసు కున్నారు. జనని పోర్టల్‌లో ఆశా మ్యాపింగ్ ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వ ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగా అందించవచ్చని ప్రోగ్రాం ఆఫీసర్ తెలిపారు. ప్రతి ఏఎన్ఎం జనని పోర్టల్ లో లబ్ధిదారుల వివరాలను కచ్చితత్వంతో, సకాలంలో నమోదు చేయాలని సూచించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంఎల్హెచ్పీలతో సమావేశమయ్యారు. గర్భిణిని కలిసి ఆమెకు అందుతున్న ఆరోగ్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, ఇతర లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ద్వారా సేవలు సమర్థవంతంగా అందించేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎంలు, ఎంఎల్హెచ్పీలు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి!

బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబర్ 15 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి-తడ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. మండలంలోని కుకుంబాకం గ్రామానికి చెందిన కారణి వెంకటరమణ (38) వృత్తిరీత్యా లారీ డ్రైవర్. విధి నిర్వహణలో భాగంగా గురువారం ఉదయం 4.30 గంటల నుండి 5.20 గంటల మధ్య స్వగ్రామం నుంచి స్కూటర్‌పై నాయుడుపేటకు బయలుదేరాడు. శ్రీకాళహస్తి వైపు వెళ్తుండగా అరిగిలి కండ్రిగ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. గుర్తు తెలియని వాహనాన్ని గుర్తించేందుకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## వ్యవసాయ సాగుకు సన్నద్ధం

బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబర్ 15 ప్రభాతవార్త : ఎల్ నినో ప్రభావంతో వానలు పడక సాగు కోసం ఎదురుచూస్తున్న రైతన్నలకు బుధ, గురువారాల్లో కురుస్తున్న వర్షాలు ఊరటనిచ్చాయి. అల్పపీడనం ప్రభావంతో మండలంలో కురుస్తున్న వర్షాలతో రైతులు ఆనందంతో పొలం సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ సీజన్లో సాగు జరుగుతుందా లేదా అనే ఆందోళనలో ఉన్న రైతులకు ఈ వర్షాలు కొంత ఉపశమనం కలిగించాయి. ముఖ్యంగా మిరప సాగు రైతులకు ఈ వర్షాలు ఎంతో సంతోషాన్ని ఇచ్చాయి. గత కొంతకాలంగా వర్షాలు పడకపోవడం, తెలుగు గంగ నీళ్ల సరఫరా నిలిచిపోవడంతో సాగు ఎలా చేయాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మిరప సాగుతో పాటు వరి నారుమడులను సిద్ధం చేసుకునేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. విత్తనాల కొనుగోలు కోసం సీడ్ దుకాణాలను సంప్రదిస్తున్నారు. ఈ వర్షాలు ఇలాగే కొనసాగి, తెలుగు గంగ నీళ్లు కూడా అందుబాటులోకి వస్తే వ్యవసాయ సాగుకు ఎటువంటి లోటు ఉండదని రైతులు ఆశిస్తున్నారు. భూమినే నమ్ముకుని ఆరుగాలం కష్టపడే రైతన్నలకు వ్యవసాయమే జీవనాధారం. వర్షాలు పడినప్పుడే ఏరువాక సాగి అన్నదాతల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తుంది.

## త్రిపురసుందరీ అలంకరణలో అమ్మవారు



ఏర్పేడు, అక్టోబర్ 15 ప్రభాతవార్త: మండలంలోని గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరాలయంలో శరన్నవరాత్రుల్లో భాగంగా 5వ రోజుఅమ్మవారు లలితాత్రిపుర సుందరి అలంకరణలో దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ బత్తల గిరిబాబునాయుడు, ఆలయ ఇఓ మునిశేఖర్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీకాళహస్తిమండలంలోని వేడంలో దక్షిణ కళికామాతా ఆలయంలో సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

## మండలాధ్యక్ష పదవికి దేశం అభ్యర్థి తాటిపర్తి రవి!



శ్రీకాళహస్తిరూరల్,అక్టోబర్ 15 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలాధ్యక్ష పదవిని తెలుగుదేశం అభ్యర్తిగా గురువారం రాజకీయాల్లో సీనియర్లుగా ఉన్న తాటిపర్తి కుటుంబానికి చెందిన రవీంద్రరెడ్డిని ఖరారు చేసినట్లు సమాచారం. మండలాక్షపదవి అన్‌రిజర్వ్‌డ్ కాగా, మండలంలో ఎంపిటిసి స్థానాలు 15 ఉన్నాయి. ఇక్కడ గెలిచిన ఎంపిటిసిలు మండలాధ్యక్షుని ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఈ పదవికి మండలంలోని నాయకులు తీవ్రంగా ప్రయత్నించారు. ముఖ్యంగా శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్య నాయుడు, రాచగున్నేరికి చెందిన నాయకుడు బొల్లినేని జగన్నాధం నాయుడు, కామేష్‌యాదవ్, కృష్ణయాదవ్, దొరైరాజ్‌లు ఎంఎల్ఏ సుదీర్‌రెడ్డి వద్ద పట్టుబట్టినట్లు సమాచారం. అయితే అందరిని సమావేశం పరచి తన నిర్ణయాన్ని ప్రకటించినట్లు తెలిసింది. మాటిచ్చాను మరువను అని ఖరా ఖండిగా తేల్చి చెప్పినట్లు తెలిసింది. తాటిపర్తి రవీంద్రారెడ్డి తండ్రి తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి మండల ఉపాధ్యక్షుడుగా ఉన్నారు. కాగా శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెటింగ్ కమిటి పదవిని అందించుటకు ఎంఎల్ఏ భరోసా ఇచ్చారు. కానీ తరువాత సమీకరణల్లో సాధ్యం కాలేదు. దాంతో ప్రస్తుతం మండలాధ్యక్ష కుర్చీ మీద కూర్చొబెట్టడానికి నిర్ణయించారు. అయితే ఏ ఎంపిటిసి నియోజకవర్గం నుంచి పోటీ చేయించాలనే అంశంపై కూడా తెరమీదకు వచ్చినట్లు సమాచారం కలవగుంట, అక్కుర్తి, వేడాం ఎంపిటిసి స్థానాల నుంచి పోటీకి కూడా పరిశీలించినట్లు సమాచారం. అయితే కలవగుంట,అక్కుర్తిలో తాటిపర్తి వారికి బంధువర్గం అధికంగా ఉన్నారు. కాబట్టి కలవగుంట నుంచి పోటీ చేయించటానికి కూడా నిర్ణయించినట్లు సమాచారం.

## రసవత్తరంగా మండలాధ్యక్షుని ఎన్నికకు పోటీ



తొట్టంబేడు, అక్టోబర్ 15 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికలు రసవత్తరంగా మారింది. రాజకీయంగా నియోజవర్గంలో తొట్టంబేడు మండలం ఉంది. ఈ నియోజక వర్గం 2019 నుంచి2026 వరకు వైకాపా పరిపాలనలో సాగింది. గతంలో జనరల్ మహిళకు కేటాయించగా మండలాధ్యక్షురాలుగా మండలంలో కీలకంగా ఉన్న ఉమ్మడి జిల్లా వైకాపా కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు సతీమణి నిర్మలమ్మ అధ్యక్షురాలుగా పరిపాలించారు. ఈ సారి ఎస్‌సి జనరల్ చేసారు. కాబట్టి వైకాపా పార్టీలో పలువురు పార్టీ టిక్కెట్టును ఆశిస్తున్నారు. దాంతో యువకులు ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. కూటమికి తిరుగే ఉండదనుకుంటున్న తరుణంలో వైకాపా పార్టీ టిక్కెట్టును ఆశిస్తున్న యువకుల సంఖ్య కూడా గణనీయంగా ఉంది. ఈ నేపథ్యంలో ఎంటెక్ చేసి ఓ సారి ఎంపిటిసిగా పదవి అనుభవించిన యువకుడు రత్నశేఖర్ ఉత్సాహంగా ఉన్నారు. మండల నాయకుడు ఉన్నం వాసుదేవనాయుడు మండలంలో గెలుపు గుర్రం కోసం అన్వేషిస్తున్నారు. అయితే మండలంలో యువకుడు తాడిపర్తికి చెందిన రత్నశేఖర్ ఉత్సాహంగా ఉన్నారు. గతంలో రౌతుసూరమాల ఎంపిటిసిగా పని చేసిన రత్నశేఖర్ విద్యావంతుడు. మండలం పట్ల అవగాహన, ప్రజా సమస్యల పట్ల చొరవ ఉంది. ఈ సారి తనకు అవకాశం కల్పించాలని పార్టీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ఈ మండలంలో ఎన్నికల తతంగాన్ని ఉమ్మడి చిత్తూరుజిల్లా వైకాపా కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడుకు అప్పగించారు. ఈ నేపథ్యంలో పార్టీ అధ్యక్షుడు కోగిల సుబ్రమణ్యం,తుమ్మూరి మోహన్‌లు కూడా కోరుతున్నట్లు సమాచారం.

## సిమెంట్ రోడ్డుపై నిలిచిపోతున్న వర్షపు నీరు



తొట్టంబేడు, అక్టోబర్ 15 ప్రభాతవార్త : మండలం పూడి గ్రామంలోని కృష్ణ మందిరం, సీతాలమ్మ గుడి ముందర వీధిలో వర్షపు నీరు నిలిచిపోయి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఈ వీధిలో సిమెంట్ రోడ్డు నిర్మించారు. అయితే వీధి ప్రారంభంలో ఉన్న రెండు ఇళ్ల యజమానులు తమ ఇళ్ల ముందు ఎర్రమట్టి, గ్రావెల్ తోలి రోడ్డు కంటే ఎత్తుగా చదును చేయడంతో వర్షపు నీటికి వెళ్లే దారి పూర్తిగా మూసుకుపోయిందని వీధివాసులు వాపోతున్నారు. పవిత్రమైన కృష్ణ మందిరం, సీతాలమ్మ గుడికి వచ్చే భక్తులు కూడా ఈ మురుగు నీటిలోనే నడవాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

## వైఎస్ఆర్ సర్కిల్ వద్ద నిలిచిన వర్షపు నీరు




శ్రీకాళహస్తి, అక్టోబర్ 15 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి వైఎస్ఆర్ సర్కిల్ వద్ద వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతిరోజూ ఈ ప్రాంతం గుండా వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వర్షం కురిసిన ప్రతిసారీ రోడ్డుపై నీరు నిలిచిపోవడం ఇక్కడ సాధారణ సమస్యగా మారిపోయింది. బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు వెళ్లే సమయంలో రోడ్డుపై నిలిచిన నీరు పక్కనే ఉన్న దుకాణాల్లోకి చేరుతుండటంతో వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. దుకాణాల ముందు నీరు నిలిచిపోవడంతో కస్టమర్లు దుకాణాల్లోకి రాలేకపోతున్నారు. స్థానికులు, వ్యాపారులు అధికారులను కోరుతున్నది ఒక్కటే కాలువలు శుభ్రం చేసి, నీరు నిలవకుండా చూడాలని మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## శీతలాంబ సేవలో వైకాపా నాయకులు



శ్రీకాళహస్తి, అక్టోబర్ 15 ప్రభాతవార్త: దేవీ నవరాత్రుల సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాలమంగళం రవి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణం కొత్తపేటలో వెలసిన శ్రీ శ్రీ సీతాలాంభ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాటంరెడ్డి పవిత్ర రెడ్డి బియ్యపు దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరూ తారక శ్రీనివాసులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేసి అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలిశెట్టి శేఖర్, పుట్ట లీలావతి, కళ్యాణి, శివ, పటాన్ ఫరీద్, జూమ్లేష, ముని రెడ్డి, కార్తీక్, మహమ్మద్ సూర్య శివ తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. నవరాత్రుల సందర్భంగా కొత్తపేటలో భక్తి వాతావరణం నెలకొంది.

## కరాటే పోటీల్లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ప్రతిభ




శ్రీకాళహస్తి, అక్టోబర్ 15 ప్రభాతవార్త: నెల్లూరులో జరిగిన గోజు-ర్యు కరాటే మిషన్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు ప్రతిభచాటినట్లు కరస్పాండెంట్ చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో కట విభాగంలో ఎస్‌కె షాజియా, ఎ. సంజన వ్యక్తిగత ప్రథమ బహుమతి, ఎస్‌కె అఫ్రిన్ ద్వితీయ బహుమతి, పి. జిగ్నాష్, ఎ. యస్విన్ తతృయ బహుమతి సాధించినట్లు తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి పాఠశాలకు మంచి పేరఉ తీసుకొచ్చిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను, కరాటే శిక్షకులను, పాఠశాల యాజమాన్యం అభినందించింది.

## గుడిమల్లం ఆలయం...మూడేళ్ళు దత్తత



ఏర్పేడు, అక్టోబర్ 15 ప్రభాతవార్త : ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఏర్పేడు మండలం గుడిమల్లం ఆలయాన్ని మూడేళ్ళ పాటు శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానానికి దత్తత ఇస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్‌సి నెం. బి2/4027(41)/1-2025 మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులతో స్థానిక శాసనసభ్యుల కల ఫలించింది. ఈ ఆలయాన్ని 2026లో జరిగిన మహాశివరాత్రి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణంరెడ్డి దత్తత ఇస్తున్నట్లు ప్రకటించారు. గుడిమల్లం ఆలయాన్ని అభివృద్ధిపరుచుటకు శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఆలయాలను ఒకే తాటిమీదకు తెచ్చి భక్తులకు దర్శన సదుపాయానికి స్థానిక శాసనసభ్యులు అభ్యర్థించారు. ఈ మేరకు శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ఇఓ ఈ ఏడాది మే 17న లెటర్ నెం. ఎ2/1331/2026లో ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలను అనుసరించి దేవాదాయ శాఖ కమిషనర్ ఆనందవల్లిసమేత పరశురామేశ్వరస్వామి దేవస్థానంను మూడు సంవత్సరాల కాలానికి శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానంకు దత్తత ఇవ్వడానికి అనుమతించారు. అయితే ఆలయానికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలు, ఇతరత్రా కార్యక్రమాలు విడిగానే నిర్వహించబడుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రికార్డులు, ఖాతాలు విడివిడిగా నిర్వహించాలని పేర్కొన్నారు. అయితే దత్తత ఇవ్వడం వలన శ్రీకాళహస్తి గుడిమల్లం ఆలయాలకు భక్తులను ఉచిత బస్సుద్వారా పంపుటకు దానిద్వారా ఆలయాభివృద్ధికి అవకాశం వుంటుందనేది ఎంఎల్ఏ ఆలోచన. అంతేకాక శ్రీకాళహస్తీశ్వరాలయంకు వచ్చే విఐపిలను గుడిమల్లం దర్శనానికి కూడా పంపేందుకు సూచించారు.

## గుడిమల్లంలో డిఐజి



ఏర్పేడు, అక్టోబర్ 15 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన ఆనందవల్లిసమేత పరశురామేశ్వరాలయంలో గురువారం డిజిపి హరీష్‌కుమార్ గుప్త కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఛైర్మన్ బత్తలగిరి నాయుడు, ఇఓ మునిశేఖర్ స్వాగతం పలికారు. ఆలయంలోని స్వామిఅమ్మవార్లను దర్శించుకున్న వారికి వేదపండితులచే ప్రత్యేక ఆశీర్వచనాలను అందించారు. ఆలయంలో చేపట్టిన అభివృద్ధిని వివరించారు. డిజిపి హరీష్‌కుమార్ గుప్తతో పాటు ఆమె సతీమణి సీమా గుప్త, కుమార్తె హైమా గుప్తలు వున్నారు.

## వెల్లివిరిసిన భారతీయ సంస్కృతీ కళావైభవం

### -వానలోనే సాగిన వాహనం



తిరుమల,అక్టోబర్ 15ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి నిర్వహించిన సర్వభూపాల వాహనసేవ సందర్భంగా వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన సంప్రదాయ కళారూపాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఏడు రాష్ట్రాలకు చెందిన 16 కళాబృందాల్లోని 437 మంది కళాకారులు తమ గాన, వాద్య, నృత్య ప్రదర్శనలతో తిరుమాడ వీధుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని ఆవిష్కరించారు.

**వివిధ రాష్ట్రాల జానపద కళారూపాల కనువిందు:**

ఉత్తరాఖండ్‌కు చెందిన గసియారి నృత్యం, కర్ణాటక సంప్రదాయ వీరనృత్యం పట్టకునిత, తెలంగాణ రాజ్‌గోండ్ తెగకు చెందిన గుస్సాడి నృత్యం, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఖజరి జానపద నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చిన్నారులు శ్రీకృష్ణుని వేషధారణలో ప్రదర్శించిన కృష్ణలీలలు, బృందావన ఘట్టాలు భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. రాజస్థానీ కళాకారులు రంగురంగుల సంప్రదాయ వస్త్రధారణతో జానపద గీతాలను ప్రదర్శించి ఆ రాష్ట్ర ఎడారి సంస్కృతిని ప్రతిబింబించారు. మహారాష్ట్రతో పాటు కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన మహిళా కళాకారులు ప్రదర్శించిన డప్పు విన్యాసాలు భక్తుల్లో ఉత్సాహాన్ని నింపాయి. శ్రీ వేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాల విద్యార్థులు భరతనాట్యం, కూచిపూడి నృత్యరూపకాల ద్వారా సర్వభూపాల వాహనసేవ వైభవాన్ని భక్తిభావంతో ప్రదర్శించారు. భారతీయ కళా సంప్రదాయాలకు వేదికగా బ్రహ్మోత్సవాలు దేశంలోని వివిధ ప్రాంతాల జానపద, సంప్రదాయ, శాస్త్రీయ కళారూపాలు ఒకే వేదికపై ప్రదర్శితమవడంతో శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు మరింత సాంస్కృతిక శోభ చేకూరింది. భక్తి, కళ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనంగా సాగిన ఈ ప్రదర్శనలు భక్తులకు కనువిందు చేశాయి.

## రేణిగుంట రాజకీయాల్లో ఎన్నికల వేడి

### -ఎంపీపీ పీఠంపై ఆశావహుల కన్ను -టీడీపీ అభ్యర్థిగా మునిచంద్రారెడ్డి?

రేణిగుంట, అక్టోబర్ 15 ప్రభాతవార్త: స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగడంతో రేణిగుంట మండలంలో రాజకీయ సందడి మొదలైంది. ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఆశావహుల్లో ఉత్కంఠ పెరిగింది. ఎవరికి వారే తమ రాజకీయ పలుకుబడి ఉపయోగించుకుంటూ పార్టీ అధిష్ఠానాల వద్ద బి ఫారం కోసం లాబీయింగ్ మొదలుపెట్టారు. మరోవైపు ఎంపీపీ పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా అధికార తెలుగుదేశం పార్టీ, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు గెలుపు గుర్రాల వేటలో నిమగ్నమయ్యాయి. దీంతో రేణిగుంట మండల రాజకీయాలు వేడెక్కుతున్నాయి. రేణిగుంట ఎంపీపీ స్థానం జనరల్‌కు కేటాయించడంతో ఇరు పార్టీల్లోనూ ఆశావహుల సంఖ్య పెరిగింది. జనరల్ ఎంపీటీసీ స్థానాల నుంచి పోటీ చేయాలనుకుంటున్న నేతలు ఎంపీపీ పదవిపై కన్నేశారు. తమకు అనుకూలమైన రాజకీయ సమీకరణాలు కుదుర్చుకునేందుకు తెరవెనుక ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. అధికార తెలుగుదేశం కూటమిలో భాగస్వాములైన జనసేన, బీజేపీలకు ఎన్ని ఎంపీటీసీ స్థానాలు కేటాయిస్తారన్న అంశంపై ఇంకా స్పష్టత రాకపోవడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. మరోవైపు ఇరు పార్టీల నాయకులు తమదే విజయమంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. టికెట్ దక్కించుకోవాలనే ఆశతో తెలుగుదేశం, వైసీపీ నాయకులు అధిష్ఠాన పెద్దల ప్రసన్నం కోసం శ్రీకాళహస్తి కేంద్రంగా మంతనాలు సాగిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గురువారం రేణిగుంట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల నాయకులు సమావేశమై ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపికపై సుదీర్ఘంగా చర్చించారు. ఎవరికి అవకాశం కల్పించాలి? ఎవరిని బరిలోకి దింపితే విజయావకాశాలు మెరుగ్గా ఉంటాయి? అన్న అంశాలపై నాయకులు తర్జనభర్జన పడినట్లు తెలిసింది. ఈ క్రమంలో రేణిగుంట తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి పేరు ఎంపీపీ అభ్యర్థిగా ప్రముఖంగా వినిపిస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఆయన అభ్యర్థిత్వం దాదాపు ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. ముని చంద్రారెడ్డి స్వగ్రామమైన గాజులమండ్యం ఎంపీటీసీ సెగ్మెంట్1 జనరల్‌కు కేటాయించడంతో ఆయనకు అవకాశం కలిసివచ్చినట్లు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక వైసీపీలోనూ ఎంపీటీసీ అభ్యర్థులు, ఎంపీపీ అభ్యర్థి ఎవరన్నది బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ గాజుల మండ్యం ఎంపీటీసీ సెగ్మెంట్1 నుంచి డీసీసీబీ మాజీ ఛైర్మన్ సిద్ధాగుంట సుధాకర్‌రెడ్డి, తూకివాకం ఎంపీటీసీ సెగ్మెంట్ నుంచి మాజీ సర్పంచి మునిశేఖర్‌రెడ్డి పేర్లు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. రేణిగుంట ఎంపీపీ పీఠం గతంలోనూ ప్రధాన పార్టీల మధ్య రాజకీయ ప్రతిష్ఠకు వేదికగా నిలిచింది. 2014 ఎంపీటీసీ ఎన్నికల సమయంలో మాజీ మంత్రి, దివంగత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు ఎంపీపీ స్థానాన్ని తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. అనంతరం జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నేతృత్వంలో వైసీపీ ఎంపీపీతో పాటు మెజారిటీ ఎంపీటీసీ స్థానాలను గెలుచుకుంది. దీంతో ఈసారి ఎన్నికల్లో ఎవరి వ్యూహాలు ఫలిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రజలకు చేస్తున్న సేవలు తెలుగుదేశం కూటమికి విజయాన్ని అందిస్తాయని ఆ పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అమలైన సంక్షేమ పథకాలు, కరోనా కష్టకాలంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అందించిన సేవలు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు చేసిన సాయం తమ పార్టీకి అండగా నిలుస్తాయని వైసీపీ నాయకులు విశ్వసిస్తున్నారు. అయితే నాయకుల అంచనాలు, పార్టీల లెక్కలు ఎలా ఉన్నా అంతిమ తీర్పు ఓటరు చేతిలోనే ఉంది. గత ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనం. ఈసారి రేణిగుంట మండల ఓటర్లు ఎవరికి పట్టం కడతారో తేలాలంటే ఎన్నికల ఫలితాల వరకు వేచి చూడాల్సిందే.